SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

పానకాలరాయు, తాడిపల్లి

నేత్రదర్పణము

ఏలూరు, 1922

Record no. 442

Pānakālarāya, Tāḍipalli

Nētradarpaṇamu

Ēlūru, 1922

Record no. 442

Bibliographic Record Target

పానకాలరాయ, తాడిపల్లి.

నేత్రదర్పణము / ఇయ్యది తాడిపల్లి పానకాలరాయనిచేత రచియింపఁబడినది.- 3. కూర్పు.- ఏలూరు : కాసంశెట్టి శేషగిరిరావు అండ్ బ్రదర్సు, 1922.

56 p. ;21 cm.

Record no. 442

Pānakālarāya, Tāḍipalli.

Nētradarpaṇamu / iyyadi Tāḍipalli Pānakālarāyanicēta raciyimpam̐baḍinadi.- 3. kūrpu.- Ēlūru : Kāsaṃśeṭṭi Śēṣagirirāvu aṃḍ Bradarsu, 1922.

56 p. ;21 cm.

Record no. 442

శ్రీ

[illegible]నేత్ర దర్పణము.

ఇయ్యది

పురాతన కవీశ్వరుఁడగు

తాడిపల్లి పానకాలరాయనిచేత

రచియింపఁబడినది.

మూడవకూర్పు 1000 ప్రతులు.

పబ్లిషర్సు:

కాసంశెట్టి శేషగిరిరావు అండ్ బ్రదర్సు,

బుక్ సెల్లర్సు, ఏలూరు, కృష్ణాజిల్లా.

శ్రీ సీతారామాంజనేయ ముద్రాక్షరశాల,

ఏలూరు.

1922.

[వెల 8 అణాలు

పీఠిక

ఆర్యులారా !

ఈ "నేత్రదర్పణ" మను గ్రంథ రాజమును మొదట అక్కిన వెంకటరత్నముగారు చాల శ్రమపడి సంపాదించి బ్ర॥శ్రీ॥ కొత్తపల్లి సుందరరామయ్యగారిచే తప్పులుతడకగానున్న వ్రాతప్రతిని కడునోపికతో సంస్కరింపించి ముద్రించి ప్రకటించి లోకమునకు మహోపకారమునొనర్చిరి. ఈగ్రంథము ప్రథమ ముద్రణప్రతులు మూడు వేలును శీఘ్రకాలములోనే అమ్ముడుబడిపోయినను తిరిగి రెండవసారి అచ్చొత్తించుటకేలనో కొంతయాలస్యమగుటచూచి దానినిత్వరలో రెండవసారి ప్రకటించిన బాగుండునని యెంచి నేనీ గ్రంథస్వాతంత్రమును అక్కిన వెంకటరత్నము గారివద్దకొని వీలయినంత త్వరలో ముద్రించితిని. ద్వితీయముద్రణప్రతుల నతికాలములో ఖర్చు పడినందున తిరిగి మూడవ కూర్పు నందినది. ఈమూడవకూర్పు మ॥ రాజశ్రీ॥ కాసం శెట్టి శేషగిరిరావు అండ్ బ్రదర్సు వారికి దీనియందు నాకుగల హక్కును యిచ్చితిని.

ఈపొత్తముయొక్క ప్రాశస్త్యమును, జనాదరణమును మొదటికూర్పు మూడువేల ప్రతులు నత్యల్ప కాలమున విక్రయింపబడుటవలననేలోకమున వ్యాపించియున్నది గనుక తిరిగి నేనిట చెప్ప నవసరము లేదు. కావునాంధ్రసోదరులందరు నిట్టి జనోపయోగమగు సద్గ్రంథమును ఆదరించెదరని నమ్ముచున్నాను.

ఇట్లు విధేయుడు,
కర్రి వేంకటరత్నము.

ఓం.

శ్రీసద్గురవే నమః

మ. అవనిన్మర్త్యుల మ్రొక్కులందిదయతో నారోగ్యముఁ గోక బాం
ధవుడై యిచ్చుచు దర్పుఁ జెందియును మిత్రఖ్యాతిఁ బెంపొంది వేఁ
డివెలుంగుంగల దయ్యమయ్యుఁ బరిపాటి న్శీతలాంభఃప్రదుం
డవు నారాయణమూర్తిఁ బ్రోచుతను నిత్యంబుఁ జగచ్చక్షుఁడై.

శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః॥

మంత్రము.

ఏవంగుణవిశేషణ విశిష్టాయాం శుభతిథౌ, గోత్రస్య, నామధేయస్య, ఆయుష్యాభివృద్ధ్యర్థం శ్రీసూర్యనారాయణ నమస్కారం కరిష్యేనమః.

శరీరేవర్తమాన వర్తిష్యమాన వాత పిత్త కఫోద్భవ నానాకారణ జ్వర క్షయ, కుష్ఠు, శూలాతిశార, పాండు, ధాతుక్షయ, వ్రణ, మేహ, భగంధరాదిసమస్తామయ నివారణార్థం హరిహరనామాత్మక త్రయీమూర్తయే భగవతే ఛాయా సమేత శ్రీసూర్యనారాయణ నమస్కారం కరిష్యేనమః.

శ్లో॥ ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః।
కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ హారీహిరణ్యావపుర్ధృతశంఖచక్రః॥

శ్లో॥ భానోభాస్కరమార్తాండ చండరశ్మిదివాకర।
ఆరోగ్యమాయుర్విజయం శ్రియః పుత్రాంసిదేహి మే॥

శ్లో॥ ఆదిదేవనమస్తుభ్యం ప్రసీదమమభాస్కర।
దివాకరనమస్తుభ్యం ప్రభాకరన మోస్తుతే॥

మంత్రము.

మిత్ర, రః, సూర్య, భాను, ఖగ, పూష, హిరణ్యగర్భ మరీచయేనమః, ఆత్మప్రదక్షిణనమస్కారాన్ సమర్పయామి॥

మూలము.

హ్రాం, హ్రీం, హ్రూం, హ్రెం, హ్రైం, హ్రౌం, హ్రః శ్రీఛాయాపద్మినీఉషాసమేత శ్రీసూర్యనారాయణ పరబ్రహ్మణేనమః। నమస్కారాన్ సమర్పయామి

౧౦౮ సారులు జపము చేయవలెను.

శ్రీ

శుభమస్తు.

నేత్రదర్పణము.

క. శ్రీకరయాదవకులర । త్నాకరసంపూర్ణతరసుధాకరవరద
ర్వీకరరాణ్మృదుతల్పద । యాకరగోపాలత్రిభువ నావనఖేలా.

టీ. శ్రీకర=శోభనుచేయువాఁడా. యాదవకుల రత్నాకర= యాదవవంశ
మును సముద్రమునకు, పూర్ణతర సుధాకర=నిండు చందురుని వంటివాఁడా వర=
శ్రేష్ఠమైన, దర్వీకర=సర్పమయిన ఆదిశేషువు, మృదుతల్ప=మెత్తనయిన పరుపు
గాఁగలవాఁడా. దయాకర = కరుణకు స్థానభూతుఁడయినట్టివాఁడా, త్రిభువన=
ముల్లోకములను, అవన=రక్షించుటయందు, ఖేలా=ఆసక్తిగలవాఁడా, గోపాలా=
ఓగోపాలమూర్తీ,

తా, యాదవవంశమును సముద్రమునకుఁ బూర్ణచంద్రునివంటివాఁడును, శే
షశాయియు, ముల్లోకములను రక్షించుటయం దాసక్తిగలవాఁడును, దయాస్వరూ
పుఁడును, శోభను చేయునట్టివాడునైన గోపాలుఁడను నామముతోఁ బ్రకాశించు
విష్ణుదేవునింగూర్చి సంబోధనము.

వ. అవధరింపుము.

సీ, శ్రీశగిరీశవాణీశులఁ బ్రార్థించి మాసతీవాగ్వధూమణులఁదలఁచి
ఆంబికేయాంజనేయాశ్వనేయాది తేయాదులనాత్మలో నభినుతించి
వాల్మీకిశ్రీశుక వ్యాసాదులగునట్టిబుషివర్యులకు నమస్కృతులొనర్చి
బాణమాఘమ యూరభవభూతి తిక్కనకాళిదాసాది సత్కవులదలచి
భావికవులను భావించి భావమలర
నొకవిధంబునకుకవుల కొప్పఁబలికి
వర్తమానకవీంద్ర విస్ఫూర్తిఁ బొగడి
యాదివైద్యులనెల్లర నభినుతింతు,

టీ. శ్రీశ=విష్ణుమూర్తిని, గిరీశ=సాంబమూర్తిని, వాణీశ=బ్రహ్మదేవుని,
ప్రార్థించి=ప్రార్థనజేసి, మా=లక్ష్మిని, సతి=పార్వతిని, వాగ్వధూమణిన్=సరస్వ
తిని, తలచి, అంబికేయ=గణనాథుని, ఆంజనేయ, హనుమంతుని, ఆశ్వనేయ=

ఆశ్వనేయులను, ఆదితేయాదులన్=దేవతులు మొదలయినవారిని, ఆత్మన్=
మనస్సునందు అభినుతించి = స్తోత్రముచేసి, వాల్మీకి=వాల్మీకియు, శ్రీశుక=శ్రీశు
కుఁడు, వ్యాస=వ్యాసుఁడు, ఆదులగునట్టి=మొదలయిన, బుషివర్యులకు=బుషి శ్రేష్ఠులకు
నమస్కృతులు=వందనములు ఒనర్చి=చేసి, బాణ=బాణకవి, మాఘ=మాఘుకవి, మయూ
ర=మయూరకవి, భవభూతి=భవభూతియనుకవి, తిక్కన=తిక్కనకవి, కాళిదాస=కా
ళిదాసకవి, ఆది=మొదలయిన, సత్కవులన్=సత్కవీశ్వరులను, తలఁచి=ధ్యానించి,
భావికవులను=ముందుబయలుదేరుకవులను భావించి=భావమునదలఁచి, భావమలరన్=అభి
ప్రాయ మొప్పునట్లు, ఒకవిధంబునన్=ఒకరీతిగా, కుకవులకు=కుత్సితకవులకు, ఒప్పఁబలి
కి=ఒప్పునట్లు వచించి, వర్తమాన=జరుగుచున్న, కవీంద్ర=కవీశ్వరులయొక్క విస్ఫూర్తి=
అతిశయమును, పొగడి=స్తవముచేసి, ఆదివైద్యులనెల్లరన్=పూర్వము ప్రసిద్ధినందియున్న
వయిద్యులనందఱిని, అభినుతింతు=స్తోత్రముచేయుచున్నాను.

తా. బ్రహ్మ విష్ణు మహేశ్వరులను ప్రార్థించి ఉమాలక్ష్మీ సరస్వతులను తల
చి, గణనాథ, ఆశ్వనేయాది దేవతలను, అభినుతించి, వాల్మీకిమొదలయిన బుషులకు నమ
స్కారములు జేసి, బాణుఁడు మొదలగు భూతభవిష్యద్వర్తమాన కవులంబొగడి పురాతన
వైద్యుల నుతింతునని.

వ. ఇట్లెల్లవేల్పులనెల్ల నూరుల మంగళాయతనంబుగఁ బొగడి కవితో
ద్యోగానురక్తుండనై మదీయాన్వయ ప్రకారం బభివర్ణించెద.

సీ. రాజాధిరాజ విరాజితసత్ప్రరి పాటియైనదికొండ వీటిసీమ
సకలవర్ణాశ్రమాచారసత్కర్మ బాహాటమైనదికొండవీటిసీమ
సంగీతసాహిత్యసరసవిద్యల నిరాఘాటమైనది కొండవీటిసీమ
అతులితానర్ఘ్యవజ్రాకరవితతిచేఁ బాటిల్లినదికొండ వీటిసీమ
ప్రకటితైశ్వర్య సౌఖ్యసంపదలఁ బొదల
నఖిలజనములకానంద మతిశయిల్ల
జగతి నేబదియారు దేశములలోన
నీటుగా నెన్నఁదగుఁగొండ వీటిసీమ.

టీ. రాజాధిరాజ=చక్రవర్తులతోఁ, విరాజిత=ప్రకాశింపఁబడిన, సత్ప్రరిపాటియై
నది=యోగ్యమగుపరిపాటికలదియు, సకలవర్ణాశ్రమాచార=సర్వమతములయొక్క, ఆ
చారములతోఁగూడిన సత్కర్మ=యోగ్యమగుకర్మలచే, బాహాటమైనది=ప్రఖ్యాతినిబొం
దినదియు, సంగీత=గానము, సాహిత్య=సాహిత్యము మొదలయిన, సరసవిద్యలన్=సరస

మయిన విద్యలచేతను, నిర్ఘాటమైనది=అడ్డులేనిదియు, అతులిత=సమానరహితమయిన (అనఁగానీడులేని) అనర్ఘ్య=వెలలేని, వజ్రాకర=వజ్రములతోఁగూడిన, వితతిచేన్=సమూహముతో, పాటిల్లినది=పేరుపొందినదియు, ప్రకటిత=ప్రచురమయిన, ఐశ్వర్య సౌఖ్య సందలన్=ఐశ్వర్యము, సౌఖ్యము, సంపత్తుచేత బొదలన్=వృద్ధిపొందఁగా, అఖిలజనములకు=సమస్త ప్రజలకును, ఆనందము=సంతోషము, అతిశయిల్లన్ = వృద్ధిపొందఁగా, జగతిన్=ప్రపంచమందు, ఏబదియారుదేశములలోనన్ = కొండవీటిసీమ, నీటుగాన్=అందముగా, ఎన్నదగున్=ఎంచవచ్చును.

తా. కొండవీటిసీమ రాజాధిరాజులచేతను సకలవర్ణాశ్రమధర్మములచేతను సర్వవిద్యలచేతను, సర్వమణులచేతను, ఏబదియారుదేశములలోను వన్నెకెక్కినదయి సమస్తజనులకు హర్షమునిచ్చుచుండెనని యెంచవచ్చును.

వ. అట్టిసీమాప్రదేశమున నుదగ్భాగంబున నింద్రకీలాచలంబునకు మ
ధ్యప్రదేశంబు మంగళాచలంబునంగల కృష్ణానదీతీరంబున

క. పదిరెండుపర్వతంబులు। విదితంబుగ నదులు రెండు విభుఁడు నృసింహుం
డదనైన దుర్గ మొక్కటి। పదపడి ముదమలరు తాడిపల్లిధరిత్రిన్.

టీ. పదిరెండుపర్వతంబులు=పండ్రెండుపర్వతములు, విదితంబుగన్=ఏర్పాటుగా, నదులు రెండు=రెండునదులును, విభుఁడు=ప్రభువు,నృసింహుండు నరసింహమూర్తియు, అదనైన=అనుకూలించిన,దుర్గమొక్కటి=ఒకదుర్గమును, పదఁపడి తాడిపల్లి=తాడిపల్లియనుగ్రామము, ధరిత్రిన్=భూమియందు, ముదమలరున్=సంతోషముగానొప్పును.

వ. అందు.

సీ. శ్రీవత్సగోత్రుఁడంచితపటుశాస్త్ర సం
ఖ్యావనీదేవకులాగ్రగణ్యుఁ
డగు తాడిపల్లిరంగామాత్యపుత్రుండు
రాజపూజ్యుఁడు సుబ్బరాయుఁడతని
తనయుఁడౌ వెంకన్నకును మహాలక్ష్మాంబ
కును తనూజులము ముగ్గురమునందు
చెలఁగి వెంకటరాయ శ్రీసీతపతిరాయ
లకు సహోదరుడనే ప్రకటముగను

పానకాలార్యుఁడనువాఁడ భవ్యయశుఁడ
నఖిలరాజాధిరాజ సభాంతరాగ్ర
పూజితుఁడ సర్వ విద్యావిరాజితుఁడను
సుజనసేవ్యుఁడ హరిభక్తి సుమహితుడను

టీ. శ్రీవత్సగోత్రుఁడు=శ్రీవత్సగోత్రమునందు జన్మించినవాఁడు అంచిత=ఒప్పునట్టి, పటు=పటుతరమైన, శాస్త్ర=శాస్త్రములయొక్క, సంఖ్యా=మొత్తముతోఁగూడి, అవనీదేవకులాగ్రగణ్యుఁడగు=బ్రాహ్మణవంశశ్రేష్ఠుడగు తాడిపల్లిరంగామాత్యపుత్రుడు, రాజపూజ్యుఁడు=రాజులచే పూజింపఁదగినవాఁడు,సుబ్బరాయఁడు, అతనితనయుఁడౌ=అతని కుమారుఁడయిన, వెంకన్నకును మహాలక్ష్మాంబకును, తనూజులము ముగ్గురము=మువ్వురు కుమారులము, అందు=మువ్వురలో, చెలఁగి=ఒప్పి, వెంకటరాయ, శ్రీసీతాపతిరాయలకు, ప్రకటముగన్=ప్రచురముగా, నేన్=నేను, సహోదరుఁడన్=తమ్ముఁడను, (అనఁగాఁ జిన్నవాఁడనుట) పానకాలార్యుఁడనువాఁడ=పానకాలరాయడను పేరుగలవాఁడను, భవ్య=మంగళప్రదమయిన, యశుఁడన్=కీర్తిన్ కలవాఁడను, అఖిల=సమస్తమయిన, రాజాధిరాజ=పెద్ద పెద్దలగు చక్రవర్తులయొక్క, సభాంతరాగ్ర=సభామధ్యములయందు, పూజితుఁడన్=పూజింపఁబడువాఁడును, సర్వవిద్యావిరాజితుఁడను=సకలవిద్యలచేతను, ప్రకాశించువాఁడను, సుజనసేవ్యుఁడన్=సుజనులచేత సేవింపఁబడువాఁడను, హరిభక్తిన్=విష్ణుభక్తిచేతను, సుమహితుఁడను=ఒప్పునట్టివాఁడను.

ఉ. నెమ్మది వైద్యశాస్త్రము లనేకములారసి నేత్రవైద్యయో
గమ్ములు కట్లుపట్లు తగు కాటుకలౌషధ నస్యపథ్యతై
లమ్ములు శస్త్రసాధనలు లక్షణమొప్పఁగ నాంధ్రభాషచే
గ్రమ్మన నేరిచింతునొక గ్రంథము లోచన దర్పణంబనన్.

టీ. నెమ్మదిన్=నిండుమనస్సుతో, వైద్యశాస్త్రములు, అనేకములు=విస్తారము అరసి=పరిశోధించి, నేత్రవైద్యయోగమ్ములు=నేత్రవైద్యముయొక్క కట్టుబాట్లును, కట్లు=కట్టుకట్టుటయు, పట్లు=పట్లుచేయుటయు, తగు=ఒప్పునట్టి, కాటుకలు=అంజనములు, ఔషధములున్=మందులును, నస్య=నస్యములు, పథ్య పథ్యములు, తైలమ్ములు=ద్రవరూపములగు చమురులును, శస్త్రసాధనలున్=శస్త్రములు చేయునుపాయములును, లక్షణమొప్పఁగన్=శాస్త్రలక్షణములతో నొప్పునట్లు, లోచనదర్పణంబనన్=నేత్రదర్పణమను పేరుతో, ఆంధ్రభాషచేన్=తెలుఁగుబాసతో, గ్రమ్మనన్=యుక్తముగా, నేన్=నేను, రచింతున్=చేయుదును.

తా॥ అనేకములగు వైద్యశాస్త్రములను పరిశోధించి కట్లు, పట్లు, కాటుకలు, తైలములు, ఔషధములు, నస్యములు, పథ్యములు, శస్త్రసాధనలు మొదలయినవాని నన్నిటిని జేర్చి శాస్త్రయుక్తముగా, ఆంధ్రభాషలో నేత్రదర్పణమను పేరుతో నొక గ్రంథమును నేను చేయుదును.

క. విద్యలలోపలనుత్తమ । విద్యయనందగిన వైద్యవిద్యకుమఱి యే
విద్యలుసరిగావెప్పుడు । వైద్యంబుపరోపకార వైభవ మొసగున్.

టీ విద్యలలోపలన్ = సకలవిద్యలలోను, ఉత్తమవిద్య = ప్రశస్తమయిన విద్య, అనందగిన = అనఁగా నొప్పిన, వైద్యవిద్యకు = వైద్యశాస్త్రమునకు, ఎప్పుడున్ = ఎన్నఁడును మఱియేవిద్యలు = తక్కిన యేయితరవిద్యలును సరిగావు = సమానము కావు, వైద్యంబు = వైద్యము, పరోపకార = ఇతరులకు మేలుజేయునట్టి, వైభవము = విభవమును, ఒసగున్ = ఇచ్చును.

తా. అన్ని విద్యలలోను వైద్యవిద్య ప్రశస్తమయినదియు వయిద్యము పరుల కుపకారము చేయునదియునియును.

సీ. అర్థిపరోపకారార్థమిదంశరీరంబని । శ్రుతివచనంబు దెలుప
తనరధర్మోవివర్ధతియంచునెప్పుడు । శాస్త్రపురాణముల్ చాటుచుండ
గురుతుగాధర్మస్యత్వరితాగతియటంచు । సాధుసంఘంబు హెచ్చరిక సేయ
నరయసమస్తలోకాస్సుఖినోభవంతని । వేదవేత్తలొయ్యనవచింప
వినుచుబాగుగ నేరాజుకనికరమున
మొదటరోగార్తజనులను బోచికొరకు
వైద్యులనునిల్పు నత్యంతవైభవమున
నతనిపుణ్యంబుబ్రహ్మకు నైనగలదె.

టీ అర్థిన్ = కోరికతో, పరోపకారార్థమిదంశరీరంబని = ఈశరీరము పరోపకారనిమిత్తమేయని, శ్రుతివచనంబు = వేదవాక్యము తెలుపన్ = తెలియఁజేయఁగా తనరన్ = ఒప్పునట్టుగా, ధర్మోవివర్ధతియంచు = ధర్మమువృద్ధియగుచున్నదని, ఎప్పుడున్ = ఎల్లప్పుడును, శాస్త్ర = శాస్త్రములును, పురాణముల్ = పురాణములును, చాటుచుండన్ = వెల్లడిచేయుచుండఁగా, గురుతుగాన్ = నిదానముగా, ధర్మస్యత్వరితాగతి = కర్మముచేయుటకుతొందరపడుము, అటంచు = అనుచు, సాధుసంఘంబు = సజ్జనసముదాయము, హెచ్చరిక సేయన్ =

ప్రోత్సాహము సేయఁగా, అరయన్ = ఆలోచించఁగా, సమస్తలోకాస్సుఖినోభవంతని = సమస్తమయిన ప్రజలును సుఖవంతులగుదురుగాక యని వేదవేత్తలు = వేదము తెలిసినవారు, ఒయ్యనన్ = వరుసగా, వచింపన్ = పలుకఁగా, ఏరాజు = ఏప్రభువు బాగుగన్ = చక్కఁగా, వినుచున్ = ఆలకించుచు, కనికరమునన్ = దయతో, మొదటన్ = ఆదియందు రోగార్తజనులను = రోగముతో బాధపడు మనుజులను, ప్రోచుకొఱకున్ = రక్షించునిమిత్తము = అత్యంతవైభవమున్ = ఎక్కువ విభవమున, వయిద్యులన్ = వయిద్యులను, నిల్పున్ = నిల్పునో, అతనిపుణ్యంబు = ఆరాజు పుణ్యము, బ్రహ్మకునైనన్ = బ్రహ్మదేవునికైనను, కలదే = ఉన్నదా, (అనఁగా లేదనుట)

తా. ఈశరీరము పరోపకారార్థము, ధర్మము వృద్ధి యగుచున్నది. ధర్మము త్వరగాఁజేయుము, సమస్తజనులు సుఖముగా నుండురుగాకయని వేదములును, పురాణములును, సాధువులును, వేదవేత్తలును పల్కఁగావిని యేరాజు ప్రజారక్షణార్థము వయిద్యుల నుంచునో ఆరాజు చేసికొనిన పుణ్యము బ్రహ్మదేవునికైన లేదనుట

వ. కావున,

సీ. కోరిముప్పదిమూఁడు కోట్లమరులకెల్ల
నాశ్వనేయులు వైద్యులైరి మొదలు
మునిజనంబులకత్రి తనయమార్కండేయ
కంకాయనాదులు ఘటకులైరి.
శ్రీరామచంద్రుని చిత్తంబురంజిల్ల
బలసుషేణాదులు బలితులైరి
విక్రమార్కునిరాజ్య విభవంబునను భట్టి
శక్తిశాబరులు ప్రశస్తులైరి
భోజవిభునాడు వైద్యులు భోగులైరి
ఆదివైద్యుడు ధన్వంత్రియనఁగ వెలసె,
గాన వైద్యంబు రాజసన్మానదంబు
సర్వజనవశ్యమిహపర సాధనంబు.

టీ. కోరి = కోరికొని, ముప్పదిమూడుకోట్లు, అమరులకెల్లన్ = దేవతుల కెల్లను మొదలన్ = మొట్టమొదట అశ్వనేయులు = అశ్వనీదేవతలు = వయిద్యులైరి, మునిజనం

లకు=మునిసముదాయమునకు, అత్రితనయు=ఆత్రేయుండును, మార్కండేయు=మార్కండేయుండును, కంకాయన=కంకాయనుండును, ఆదులు=మొదలయినవారు, ఘటకులైరి=శ్రేష్ఠులైరి, శ్రీరామచంద్రుని=శ్రీరామమూర్తియొక్క చిత్తంబు=హృదయము, రంజిల్లన్ ప్రకాశించునట్లు, బల=బలుడును, సుషేణ=సుషేణుండును, ఆదులు=మొదలయిన వారు బలితులైరి=ప్రముఖులైరి. విక్రమార్కుని=విక్రమార్క మహారాజుయొక్క, రాజ్యవిభవంబున=రాజ్యవైభవమందు, భట్టి=భట్టియును, వారేడు, శక్తి, శాబరులు = శక్తియు శాబరియు, ప్రశస్తులైరి=పొగడొందినవారైరి భోజవిభునాడు = భోజమహారాజు కాలమున, వైద్యులు, భోగులైరి = భోగవంతులైరి, ఆదివయిద్యుండవ = మొదటవయిద్యుడు, ధన్వంతరియనగన్=ధన్వంతరియను పేరుతో, వెలసెన్=ప్రకాశించెను, కాన=కాబట్టి, వయిద్యంబు=వయిద్యము, రాజసన్మానదంబు=రాజులచేతనైన గౌరవమును, ఇచ్చునది, సర్వజనవశ్యము=సకలజనులను వశపరచునదియు, ఇహపరసాధనంబు=ఇహలోక పరలోక సాధనమైనది.

తా. ముప్పదిమూడుకోట్లు దేవతలకును, అశ్వనీదేవతులును, మునులకు, ఆత్రేయ మార్కండేయ, కంకాయను లనువారును, శ్రీరామునియొద్ద బలసుషేణాదులును, విక్రమార్కునియొద్ద భట్టియు, శక్తియు, శాబరియు, ఇంకను భోజరాజువొద్ద చాలమంది వయిద్యులును పేరుపొంది యుండిరి. ధన్వంతరియని ఆదివయిద్యుఁడు ప్రకాశించెను. కాఁబట్టి వయిద్యము సకలజనులను వశ్యపరచుకొని, ఇహపర సాధనము గలదియై, రాజసన్మానము నొసంగును.

గీ. ఇంద్రియంబులలో నయనేంద్రియంబు
తగఁ బ్రధానంబుగావునఁ దదుపయోగ
వైద్యములుకోరిచేసిన వైద్యజనము
లైహికాముష్మికసుఖంబు లందుటరుదె.

టీ. ఇంద్రియంబులలోనన్=పంచేంద్రియములందు, నయనేంద్రియంబు=నేత్రమను నింద్రియము, తగన్=ఒప్పునట్లు, ప్రధానంబు=ముఖ్యమయినది కావునన్=కాబట్టి తత్=ఆనేత్రసంబంధమయిన, ఉపయోగ=పనికివచ్చు, వయిద్యములు=చికిత్సలు, కోరికొనచేసినన్=చేసినయెడల, వయిద్యజనములు=వైద్యులు, ఐహికాముష్మిక సుఖంబులు ఇహపరలోక సౌఖ్యములు, పొందుట, అరుదె=ఆశ్చర్యమా ?

తా. అన్ని ఇంద్రియములలోనయనేంద్రియము ముఖ్యమయినది కావున తత్సంబంధమగు చికిత్సలు చేసిన వైద్యులు, ఇహపరలోక సౌఖ్యములను పొందుటకేమివింత.

వ. అదియునుంగాక.

క. మిత్రాది దైవకంబగు । నేత్రంబులబాడము రోగ నికరములడపం
బాత్రములగువైద్యులకా।మిత్రునిసాలోక్యసుఖము మేలుగగలుగున్

టీ. మిత్రము (అనఁగా ఏదియోయొకప్రమాదము) ఆది=మొదలగు దైవికంబు=దైవముపుట్టుకలో చేసినవియైన నేత్రంబులన్=కనులయందు, పొడము=పుట్టునట్టి, రోగనికరములు=రోగసముదాయములు అడపన్=పోగొట్టుటకు, పాత్రములగు=తగినట్టి వైద్యులకు ఆమిత్రుని=ప్రసిద్ధుడగు సూర్యుని, సాలోక్య సుఖము, మేలుగన్=చక్కఁగా, కలుగున్=కలుగును.

తా. ఏదియైన ప్రమాదమువలన, దైవికముగనైనను కనులకు గలిగిన జబ్బులను బాగుచేయు వైద్యుండు సూర్యసాలోక్యముం బొందుననుట.

వ. రోగోత్పత్తిలక్షణాభి ధానంబు లెఱింగించెద.

తా. రోగములు పుట్టుటకు లక్షణములు, వానిపేరులుం జెప్పెదము.

గీ. తల్లిదండ్రుల గురువుల ధరణిసురుల
సురలమౌనుల శ్రుతులను హరిహరులను
నిందలొనరించుపాపముల్ గ్రందుకొనఁగ
నయనరోగంబులుదయించు నరులకండ్రు.

టీ. తల్లిదండ్రులన్=తల్లిదండ్రులను, గురువులన్=గురువులను, ధరణిసురులన్=బ్రాహ్మణులను, సురలన్=దేవతులను, మౌనులన్=మునీశ్వరులను, శ్రుతులన్=వేదములను, హరిహరులన్=విష్ణువును, శంభువును, నిందలొనరించు=దూషణములు చేయుటవల్లనైన, పాపములు, గ్రందుకొనఁగన్=చుట్టుకొనగా, నరులకు=మనుజులకు, నయన రోగంబులు=నేత్రజాడ్యములు, ఉదయించున్=పుట్టును, అండ్రు=అనెదరు.

తా. తల్లిదండ్రులను, గురువులను, బ్రాహ్మణులను, దేవతలను, వేదములను, మునీశ్వరులను, హరిహరులను నిందించిన పాపమే నేత్రరోగములుగా నరులకుఁ బుట్టుననెదరు.

శా. నానాదేశవిహారముల్సలుప నానానీరపానంబులన్
నానాశీతల వస్తుసేవనలు నానాపథ్యభంగంబులన్
నానాభ్యంజనదుర్భరంబుల ననూనంబైన దుఃఖంబులన్
గానందొంబది యాఱునేత్రరుజముల్ గల్పించుమర్త్యాళికిన్.

టీ. నానాదేశవిహారముల్ సలుపన్=అనేకదేశములు తిరుగుటను, నీరపానంబులన్=అనేకజలములు త్రాగుటకును, నానా=ఎక్కువయిన, శీతల=చలువయైన, వస్తు=వస్తువులయొక్క, సేవనలు=తినుటను, నానా=సమస్తమైన, పథ్యభంగంబులన్=అపథ్యదోషములును, నానా=పలువిధములైన, అభ్యంజన=స్నానములయొక్క, దుర్భరంబులను=భరింపలేకపోవుటను, అనూనంబైన=ఎడతెగని, దుఃఖంబులన్=విచారములను, కానన్=పొందఁగా, తొంబదియాఱు, నేత్రరుజముల్=నేత్రరోగములు, మర్త్యాళికిన్=జనసముదాయమునకు, కల్పించు=పుట్టించును.

తా. పలుదేశములు తిరుగుట, అన్నిజలములు త్రాగుట, అన్ని చలువవస్తువులు సేవించుట, అపథ్యము చేయుట పలువిధములుగా స్నానము చేయుట ఎక్కువగా నేడ్చుట, మొదలయినవానిచే మనుజులకు తొంబదియాఱు నేత్రరోగములు పుట్టుచున్నవి.

వ. అవి యేవియనిన,

గీ. అనిల, కఫ, పిత్త, రక్తంబులనెడు నాల్గు
మించుగుణములనవి వికారించెనేని
కన్నుగవలను రోగముల్ గలుగుమిగుల
నవియభిష్యందనామధేయములు కృష్ణ.

టీ. అనిల=వాయువు, కఫ=శ్లేష్మము, పిత్త=పైత్యము, రక్తంబులు, అనెడు=అనునట్టి, నాల్గున్=నాలుగును, మించుగుణములన్=తమనైసర్గిక గుణములనుండి, అవి=ఆనాలుగును, వికారించెనేని=వికారమును పొందినయెడల, కన్నుగవలను=నేత్రద్వయములను, రోగముల్=జబ్బులు, మిగులన్=మిక్కిలి, కలుగున్=పుట్టును, అవి=ఆవికారించిన నాలుగును, కృష్ణ=ఓకృష్ణమూర్తీ, అభిష్యంద నామధేయములు=అభిష్యందములను పేరుగలవి.

తా. ఓకృష్ణమూర్తీ అనిల, కఫ, పిత్తరక్తములనునట్టి నాలుగు నాడులును తమ స్వభావమునుమాని మఱియొకరీతిని మారినయెడల కనులయందు మిక్కిలి రోగములు గలుగును. అవియే యభిష్యందములని పేరుఁగలవి.

వ. దేవా ! మఱియు రక్తశ్వేత కృష్ణపీత వర్ణంబులైన కాచరోగచతుష్టయంబును రక్తపటలంబును, శ్వేతపటలంబును కృష్ణపటలంబును పీతపటలంబును దివాంధంబును నిశాంధంబును తిమిరంబును నేత్రపుష్పంబును చర్మార్బుదంబును జలస్రావంబును అతిస్రావంబు నేత్రదాహంబును నేత్రవాతంబును నేత్రగంధియు నేత్రలూతికయు నేత్రశోధయు నేత్రశూలయు రక్తపిళ్ళంబును కృష్ణపిళ్ళంబును శుక్లపిళ్ళంబును పీతపిళ్ళంబును నేత్రబుద్బుదంబును నేత్రకాయంబును, రక్తగ్రంధియు, చత్వారియు, నేత్రసూక్ష్మచలనంబును, నేత్రచలనంబును, నేత్రజరంబును, నేత్రబంధంబును, నేత్రభ్రమణంబును, నేత్రమాలిన్యంబును, నేత్రశరయు, ద్వినేత్రంబును నేత్రభగ్నంబును, నిశ్చితంబును, నేత్రఖండంబును, అధోదృష్టియు, ఊర్ధ్వదృష్టియు, నేత్రాగ్నియు, నేత్రపాతంబును, నేత్రపూయంబును, నేత్రకుష్టువును, నేత్రరుద్ధదృష్టియు నేత్రోన్మీలనంబును, నేత్రనిమీలనంబును, మందదృష్టియు, నేత్రమలంబును, నేత్రఘూర్ణనంబును, కృష్ణమండలంబును, శుక్లపుష్పంబును, రక్తపుష్పంబును, పీతపుష్పంబును అగ్నిగ్రంధియును, నేత్రతిమలంబును, నేత్రవల్మీకంబును, పక్ష్మఘాతంబును, పక్ష్మశూలయు, పక్ష్మశోభయు, పక్ష్మదాహంబును, పక్ష్మపక్ష్మంబును, పక్ష్మజాతంబును, పక్ష్మచలనంబును, పక్ష్మాతిచలనంబును, పద్మార్బుదంబును, పద్మకాయంబును, పద్మఖండంబును, నేత్రపార్శ్వయు జలస్రావయు, నేత్రపార్శ్వశూలయు, నేత్రపార్శ్వశోభయు, నేత్రపార్శ్వఖండూతియును, నేత్రపార్శ్వచాంచల్యంబును, నేత్రపార్శ్వరక్తంబును, నేత్రస్ఫురణంబును, నేత్రరోధంబును, నేత్రస్ఫోటకంబును, నేత్రవిలూకనంబును, నేత్రఫల్లంబును, నేత్రపుష్పంబును, నేత్రగాఢాగ్నియు, దుఃఖనేత్రంబును, దుర్మదాంధంబును, పక్ష్మదుర్మాంసంబును, నేత్రపిపీలికంబును, నేత్రతిరోమంబును, నేత్రతిరోమనాళంబును, ఆదిగాఁగల తొంబదియాఱు నేత్రరోగంబులం దభిష్యంద రోగంబుల తెఱంగెఱింగించెద.

సీ. నేత్రంబు లెఱ్ఱనై నీరుచేపోటుచే
నలయుంపఁ వాయ్వభిష్యందమనిరి
కలిగికన్నుల మంటగలిగి మెఱ్ఱెరలాడ
పైత్యాభిష్యందమా భారమనిరి

నయనంబులను పుసుల్ నసమెర్లుగల్గిన
శ్లేష్మాభిష్యందమా చేష్టలనిరి
దుర్మాంసములుబుట్టి దుర్భరవ్యధసేయ
రక్తజాభిష్యంద యుక్తమనిరి

గీ. కానయిటువంటి నయనరోగములవిధము
లరసియాలస్యముగ కాలమరుగనీక
తగినసాధనములు ముఖ్యముగనుజేసి
బాగుసేయంగఁదగు భోగిభోగశయన.

టీ. నేత్రంబులు=కన్నులు, ఎఱ్ఱనై=ఎరుపుగలవై, నీరుచేఁ=నీటిచేత, పోటుచేఁ=పోటుచేతను, అలయింపఁ=బాధపుట్టగా, వాయ్వభిష్యందము=వాతమునఁ గలిగిన అభిష్యందరోగము, అనిరి=చెప్పిరి, కలిగి=కన్నులు కలకబడి, కన్నులఁ=నేత్రములందు, మంటగలిగి = మంటతోఁగూడుకొని, మెర్మెరలాడఁ = గరగరలాడినయెడల పైత్యాభిష్యందము=పైత్యమువలనఁ బుట్టిన అభిష్యందరోగము, ఔ=అగునట్టి, భారమనిరి=బరువని చెప్పిరి, నయనంబులను=నేత్రములయందు, పుసుల్=పుసులును, నసిముర్లు=దురదలు, కలిగినఁ=పుట్టినయెడల, శ్లేష్మాభిష్యందము=శ్లేష్మమువలన పుట్టిన అభిష్యందరోగము, ఔ=అగునట్టి, చేష్టలనిరి=గుణములని చెప్పిరి, దుర్మాంసములు=కుదుపగట్టిన మాంసము, పుట్టి=కలిగి, దర్భర=భరింప శక్యముగాని, వ్యధసేయఁ=బాధపెట్టగా, రక్తజాభిష్యం దయుక్తము=రక్తమువలన బుట్టిన అభిష్యందరోగముతోఁ గూడినది, అనిరి=చెప్పిరి, కానఁ=కాఁబట్టి, ఇటువంటి=ఈవిధమయిన, నయనరోగముల విధములు=నేత్రజాడ్యములయొక్క గుణములు, అరసి=ఆలోచించి, ఆలస్యముగఁ=ఆలస్యముచేత కాలము, అరుగనీయక=పోనీయక, తగిన సాధనములు=తగినట్టి చికిత్సలు, ముఖ్యముగనుజేసి=తప్పకజరిపి, భోగి=సర్పముయొక్క, భోగ = పడగయే, శయన=పడకఁగా గలిగిన ఓవిష్ణుమూర్తీ! బాగుసేయందగున్=బాగుసేయఁదగును.

తా. కన్నులు ఎరుపెక్కి పోటులుగలిగి నీరుగారుచుండిన వాయ్వాభిష్యంద మనియు, కనులు ఇసుకనఁబడి మెరమెర లాడుచుండినయడల పైత్యాభిష్యందమనియు, కనులు పుసికట్టి దురదలు గలిగినయెడల శ్లేష్మాభిష్యంద గుణములనియు, కనులయందు కొయ్యాగండలు పెరిగి బాధపెట్టినయెడల రక్తాభిష్యందమనియు, చెప్పెదరు. కాబట్టి

యిట్టి నేత్రరోగములను గుర్తించి రోగము ముదురకమునుపే తగిన చికిత్సలొనర్చి బాగుచేయవలెను.

వ. తత్సాధన భేదంబులు లక్షణ లక్ష్యంబుల నెఱింగించెద. సావధానంబుగ నాకర్ణింపుము.

మ. తనపూర్వంబున సేయుదోషచయముల్దార్కొన్న రోగంబులై
తనరుంగావున నాదిపూరుషుఁడు తాధన్వంత్రియైపుట్టి యీ
జనులం బ్రోవదలంచి యాధిజనులం జర్చించితచ్ఛాంతికై
కనిపెట్టెన్సకలౌషధంబులు దయంగల్పించె శాస్త్రోన్నతిన్.

టీ. తన=తనయొక్క పూర్వంబున సేయు=పూర్వజన్మమునఁ జేసుకొనిన, దోషచయముల్=పాపసమూహములు, దార్కొన్నఁ = చుట్టుకొనఁగా, రోగంబులై=ఆ పాపంబులే వ్యాధులై, తనరుఁ = ఒప్పును. (అనగా సంభవించునంట) కావునఁ= కాబట్టి, ఆదిపూరుషుఁడు=భగవంతుఁడు, తాఁ=తాను, ధన్వంత్రియై=ధన్వంతరియను వైద్యశ్రేష్టుఁడై, పుట్టి=జన్మించి, ఈజనులఁ=ఈప్రపంచమందలి మనుష్యులను, ప్రోవఁ=ప్రోచుటకు, తలంచి=ఎంచి, ఆధిజనులఁ=మనోవ్యధగలిగిన మనుష్యులను, చర్చించి=విచారణచేసి, తత్=ఆరోగమూలమైన మనోవ్యధయొక్క, శాంతికై=నెమ్మదించునిమిత్తము, శాస్త్రోన్నతిఁ=శాస్త్రప్రకారము, దయఁ=ప్రేమతో, కల్పించి= ఊహించి, సకలౌషధంబులుఁ = అన్నివిధములగు మందులును, కనిపెట్టెఁ = తెలుసుకొనెను.

తా. పూర్వజన్మమునఁ జేసికొనిన పాపకర్మములే రోగములై జనులను బాధించుచుండ భగవంతుఁడు ధన్వంతిరియై మనుష్యుల బాధలు నివారించుటకు పుట్టి శాస్త్రోక్తమగు నౌషధములను ఊహించి కనిపెట్టెను.

వ. అవి యెయ్యవియనిన,

గీ. కట్లుపట్లును పథ్యముల్ కాటుకలును
నస్యములు తైలములు భేదనములు నౌష
ధములు నద్దములనఁ దొమ్మిదవమరునేత్ర
రోగసాధనలగు భోగిభోగశయన.

టీ. కట్లు=కట్లును=పట్లును=పథ్యములు=పథ్యములును=కాటుకలును, నస్యముల్=పొడుములును- తైలముల్=చమురులును- భేదనములున్=పొరలు దీయుటయును- ఔషధములున్=మందులును- అద్దములున్=సులోచనములు మొదలగునవియు=అనన్= అనఁగా-భోగిభోగశయన=పాము పడగమీదపవ్వళించు విష్ణుమూర్తీ- తొమ్మిది అమరు=ఒప్పునట్టి నేత్రరోగసాధనలు=కండ్లజబ్బులు బోఁగొట్టుసాధనములు- అగున్= అవును.

తా. కట్లు, పట్లు, పథ్యములు, కాటుకలు, నస్యములు, తైలములు, భేదనములు, ఔషధములు, అద్దములు అను తొమ్మిదియును నేత్రరోగములను బోఁగొట్టు సాధనములు,

వ. అందుకట్ల తెరంగెఱింగించెద.

కట్లనిర్ణయము.

క. అనువెఱిఁగి తములపాకులు
నొనరఁగ వేర్వేఱగాను గుమ్మెత్తాకుల్
కనులపయిఁ గట్టినంతనె
చనెడునభిష్యందరోగ చయము రమేశా.

టీ. రమేశా=ఓవిష్ణుమూర్తీ- అనువెఱిఁగి = వీలు తెలిసికొని- తములపాకులు కానుగు=గానుగచెట్టుయొక్కయు- ఉమెత్త=ఉమెత్తయొక్కయు- ఆకుల్- ఆకులు వేర్వేఱన్=వేరువేరుగా- ఒనరఁగన్ = ఒప్పునట్లు- కనులపయిన్ = నేత్రములమీద- కట్టినంతనె=కట్టినతోడనే అభిష్యందరోగచయము = అభిష్యందమను పేరుగల రోగ సముదాయము- చనెడున్=పోవును.

తా. తములపాకులును, కానుగాకులును, (గానుగ) ఉమ్మెత్తాకులును, వేర్వేఱుగా కనులకు వేసి కట్టినయెడల అభిష్యందరోగములు పోవును.

వ. మఱియును,

చ. తులసియు బొన్నగంటి నలతుమ్మయు సన్నకసింత మారెడా
కులు కడువేఱువేఱుగను గోఘృతమందునవేచి కండ్లనిం

పలరఁగఁగట్టినన్మఱియు నన్నము నేయియుఁగట్ట రెప్పనొ
ప్పులుపుసినీరు మెర్మెరలు పోటులుమంటలు మానుఁ గేశవా.

టీ. కేశవా=ఓవిష్ణుమూర్తీ, తులసియున్=తులసియును, పొన్నగంటి= పొన్నగంటియును, నలతుమ్మయు = నల్లతుమ్మయును, సన్నకసింత = సన్నకసింతయు, మారెడు=మారేడును, ఆకులు=వీటియాకులు, వేఱువేఱుగను=విడివిడిగా, గోఘృతముంగొని=ఆవునేయితీసికొని, వేచి=వేపి, కండ్లన్=కనులకు, ఇంపలరగ గట్టినన్=చక్కఁగా కట్టినయెడలను, మఱియు=ఇంతేకాకుండ, అన్నము, నేయియుఁగట్టన్=అన్నము నేయియును గట్టినయెడలను, రెప్పనొప్పులు=రెప్పలయందుఁబుట్టిన నొప్పులును, పుసి=పుసులుగారుటయు, నీరు=నీరుగారుటయు, మెర్మెరలు=మెరమెరలాడుటయు, పోటులు=పోట్లుపొడుచుటయు, మంటలున్=మంటలుగానుండుటయును, మానున్= పోవును.

తా. రెప్పలయందు నొప్పులున్నను, కనులు పుసికట్టుచుండినను, నీరుగారుచుండినను, మెరమెరలాడుచుండినను, పోట్లు మంటలు గలిగియున్నను, తులసియాకు పొన్నగంటియాకు నల్లతుమ్మాకు సన్నకసింతాకు మారేడాకులును వేఱువేఱుగా ఆవునేతితో వేచి కట్టినయెడల మానును.

వ. పట్లవిధంబెఱింగించెద.

పట్లనిర్ణయము.

గీ. కరకకాయశిలాజిత్తు కావిఱాయి
సైంధవముమ్రానిపసపును సలిలములను
దీసికన్నులపైఁబట్టు వేసిరేని
వినుమభిష్యందములుమాను వనధిశయన.

టీ. కరకకాయ = కరకకాయయును, శిలాజితు=శిలాజితును, కావిఱాయి= కపురంగుగల సుద్దరాయియు, సైంధవము = ఇందుప్పును (అనగా సింధువునం బుట్టిన లవణము) మ్రానిపసపు=మ్రానిపసపును, (దారుహరిద్రము) సలిలములను= నీటితో, తీసి=నూరితీసి, కన్నులపైన్=నేత్రములమీఁద, పట్టు వేసిరేని=పట్టు వేసిన యెడల, వనధిశయన=పాలసముద్రమున పవ్వళించిన యోవిష్ణుమూర్తీ=అభిష్యం

దములు=అభిష్యంద నామములుగల కంటిజబ్బులు, మాను=నివర్తించును. (పోవును.) వినుము=ఆలకింపుము.

తా. కరకకాయయు, శిలాజిత్తును, ఎఱ్ఱరంగు సుద్దరాయియు, సైంధవ లవణమును, మ్రాని పసపును, నీటితో నూరి కనులకుఁ బట్టించిన యెడల నభిష్యంద రోగములు మానును.

క. వినుమ్రాని పసపుగైరిక
మునుముస్తెలు మేకపాల ముదమొప్పంగాఁ
గనులపయి పట్టువేసిన
మునుకొని సకలాక్షిరోగములు మానుహరీ.

టీ. హరీ=విష్ణుమూర్తీ, వినుము=ఆలకింపుము, మ్రానిపసపున్ = మ్రానిపసపును, గైరికమును = పర్వతధాతు విశేషమగు పదార్థమును, ముస్తెలు = తుంగ దుంపలును, మేకపాలన్ = మేకపాలతో, ముదమొప్పంగాన్ = సంతోష మతిశయించునట్లు, కనులపైన్=నేత్రములమీఁద, పట్టువేసినన్ = పట్టు వేసినయెడల, మునుకొని=మొదలుపెట్టి, సకల=సమస్తవిధములగు, అక్షిరోగములు = కంటిజబ్బులు, మానున్= పోవును.

తా. మ్రానిపసపును, గైరికమును, తుంగదుంపలు, మేకపాలతో నూరి కనులకుఁ బట్టించిన యెడల సమస్తవిధములగు కంటిజబ్బులును మానును.

ఆ. మాడయెత్తు నల్లమందొక చిన్నంబు
పటిక భంగివిత్తులటులవంగ
ములును జన్నుబాల ముఖ్యంబుగావండి
పట్టువేయ నేత్రబాధలణఁగు.

టీ. నల్లమందు మాడయెత్తును, పటిక ఒక చిన్నమును, భంగివిత్తులు=గంజాయి గింజలు, అటు = పయినిచెప్పిన చిన్నమును, లవంగములు, ఒక్క చిన్నమెత్తును, చన్నుబాలన్ = చనుబాలతో, ముఖ్యంబుగాన్ = ప్రశస్తముగా, వండి = పాకము చేసి, పట్టువేయన్ = పట్టు వేసినయెడల, నేత్రబాధలు, కంటిబాధలు = అణఁగున్ అడఁగిపోవును.

తా. నల్లమందు మాడయెత్తును, పటిక, గంజాయివిత్తులు, లవంగములు ఒక్కొక చిన్నము చొప్పున చనుబాలతో వండి పట్టువేసినయెడల నేత్రబాధలుపోవును.

వ. పథ్యలక్షణం బెఱింగించెద.

పథ్యనిర్ణయము.

చ. కలగరచేఁత రాసియును గజ్జెరుచిత్రియుఁ బొన్నగంటి బా
యిలకొయతోటకాడ లుడికించినకూరయు చింతపొట్టునుం
బలుచనియావుమజ్జిగయుఁ బచ్చపెసల్ వరివంటకంబునన్
బలిమిగ నేత్రరోగముల పథ్యములౌను రమామనోహరా.

టీ. రమామనోహరా = ఓయిలక్ష్మీమనోహరుఁడా, కలగర = గుంటకలగరయు, చేతరాసి=చేదరాసికూరయు, గజ్జెరు=గజ్జేరును, చిత్రియున్ = చిత్రికూరయు, పొన్నగంటి=పొన్నగంటికూరయును, బాయిల=బాయిలాకును, కొయితోటకాడలు = కొయ్యతోటకూర కాడలును ఉడికించినకూరయు = పచనముచేసినకూరయు, చింతపొట్టును, చింతాకుపొట్టును, పలుచనియావుమజ్జిగయున్ = పల్చగానుండు ఆవుచల్లయును పచ్చపెసల్ = పచ్చపెసలును, వరివంటకంబునన్, బలిమిగను- ఎక్కువగా, నేత్రరోగముల-కనులజబ్బులయొక్క, పథ్యములవును = పథ్యవస్తువులగును.

తా. గుంటకలగరయు, చేదరాసికూరయు, గజ్జెరు, చిత్రికూర, పొన్నగంటికూర బాయిలాకు, కొయ్యతోటకూర, చింతపొట్టు మొదలయిన యుడికించిన కూరలును, పలుచని ఆవుమజ్జిగయును పథ్యపదార్థములు.

వ. అపథ్యలక్షణం బెఱింగించెద.

అపథ్యలక్షణము.

ఉ. ఎండినకూరలుం బెరుగు నింగువమాంసము కల్లునువ్వులున్
మెండుగనీళ్ళుత్రాగుటయు మిన్ములబూరెలు నుప్పుతమ్ములం
బెండయుఁగోపముం బయనమేగుటస్నానము స్త్రీసుఖంబుచే
నుండుట నేత్రరోగులకు నొప్పదు శ్రీరమణీమనోహరా.

టీ. ఎండినకూరలన్=ఎండిపోయిన కూరలున్ పెరుగున్=పెరుగును ఇంగువ= ఇంగువయు, మాంసము కల్లు నువ్వులును, మెండుగన్=విస్తారముగా, నీళ్ళు త్రాగుటయు, మిన్ములబూరెలున్=మినపబూరెలున్, ఉప్పు=ఉప్పును, తమ్ములంబు=తాంబూలంబును, ఎండయున్ = ఎండఁ బడుటయును, కోపమున్ = కోపించుటయు

ను, పయనమేగుట = ప్రయాణముచేయుట, స్నానము = స్నానముచేయుట, స్త్రీసుఖంబుచేఁ = స్త్రీతోరమించుటచేత, ఉండుట, శ్రీరమణీమనోహరా = లక్ష్మీమనోహరుఁడగు విష్ణుమూర్తీ, నేత్రరోగులకు = కంటిజబ్బులు గలవారికి, ఒప్పదు = తగదు.

తా. [కం]టిజబ్బులుగలవారు ఎండినకూరలును, పెరుగు, ఇంగువ, మాంసము, కల్లు, నువ్వులు, విస్తారముగా దాహము త్రాగుట, మినపబూరెలు తినుట, ఉప్పు, తాంబూలము వేయుట, ఎండబడుట, కోపము జెందుట, ప్రయాణము చేయుట, స్నానముచేయుట, రమించుటయు తగదు.

వ. కాటుకలు సేయు తెరంగు లెఱింగించెద.

1. లాక్షాంజనము.

ఆ. లక్కమ్రానిపసపు రక్తమణిశ్శిల
వావిళంగములును కావిరాయి
చెలులపాల బాలకులకుఁ గన్నులవేయ
గూనలంటుకలక మానుగృష్ణ.

టీ. లక్క = లక్కయును, మ్రానిపసుపు = మ్రానిపసుపును, రక్తమణిశ్శిల = ఎఱ్ఱమణిశిలయును, వావిళంగములును = వాయువిళంగములును, కావిరాయి = జేగురు ముద్దరాయియు, చెలులపాలఁ = స్త్రీలపాలతో (చనుబాలు) బాలకులకు = పిల్లలకు, కన్నులవేయఁ = కనులకు వేసిన యెడల, గూనలు = కనులలో గూనలు వేయుటయు, అంటు = కనులంటుకొనుటయు, కలక = కంటికలకయును, కృష్ణ మానును = పోవును.

తా. బాలులకు కనులలో గూనలు బయలుదేరినను, అంటుకొను చుండినను, కలిగినను, లక్క, మ్రానిపసపు, ఎరుపుగల మణిశిల, వాయువిళంగములు, ఎఱ్ఱసుద్దరాయి, చనుబాలతో వేసినయెడల కుదురును.

2. అక్షాంజనము.

ఆ. మైలుతుత్తము నతిమధురంబు నుసిరిక
పప్పు తాడికాయపలుకు మిరియ

ములునుసరిగతోయములనూరి యిడనేత్రి
పటలతిమిరములను బాపుకృష్ణ.

టీ. కృష్ణా=కృష్ణమూర్తీ, మైలుతుత్థముఁ=మయూరతుత్తమును, అతి మధురంబును=యష్టిమధుకంబును, ఉసిరికపప్పు=ఉసిరికకాయ పప్పుఁ, తాడికాయ పలుకుఁ=తాడికాయ పలుకులును, మిరియములును, సరిగఁ=సమాన భాగములుగా, తోయములనూరి=నీళ్ళతో నూరి, యిడఁ=వేసినట్టయిన, నేత్రి=కనులయొక్క, పటల=పటలమను జబ్బును, తిమిరములను=కనుల చీకట్లు గ్రమ్ముటను, బాపుఁ=పోగొట్టును.

తా. కనులకు పటలరోగములుగాని, చీకట్లుగాని, గలిగియున్నయెడల మైలుతుత్థమును, యష్టిమధుకంబును, ఉసిరికపప్పు, తాడికాయ పలుకులు, మిరియములు సమాన భాగములుగా నీటితో నూరి కనులకు పట్టించినయెడల మానును.

3. సుదర్శనాంజనము.

సీ. శ్రీగంధమును మణిశిలసింధులవణంబు
హారిదళంబునుశంఖ మతిమధురము
మిరియాలుపటికయు మేలుగా సమభాగ
ములుగూర్చి జలములఁ గలియనూరి
కణికలుగాఁజేసి గాఢ్పొర్చియువతుల
చనుబాలనైనను మునుగపూల
రసముచేనైనను రాచికన్నులఁబెట్టి
నట్టివారికి నిశ్చయంబుగాను
గీ. శుక్లపటలమ్ములన్నియు సుడిసిపోవుఁ
బొరలు దిమిరంబులవిరులు బొలియునీసు
దర్శనాంజనమునన్నద్రి ధరముకుంద
విమలగుణబృంద గోవింద విశ్వతుంద.

టీ. అద్రిధర=పర్వతమును ధరించినట్టియు, విమల = స్వచ్ఛమగు, గుణబృంద= సద్గుణ సమూహము గలిగినట్టియు, విశ్వతుంద=ప్రపంచమంతయు బొజ్జయందు గలిగినట్టియు, ముకుంద=ముకుందుడను నామాంతరము కలిగినట్టియు, గోవింద=శ్రీకృష్ణ

మూర్తీ, శ్రీగంధమును = చందనమును (మంచి గంధము) మణిశిల=మణిశిలయు, (కొండలమీఁదియొకదినుసు ఎఱ్ఱమన్ను) సింధులవణంబు=సైంధవ లవణంబును, హరిదళంబును=అరిదళమును- (హరితాళము) శంఖము = శంఖమును, అతిమధురము=యష్టిమధుకమును, మిరియాలు=మిరియములును, పటికయు=పటికారమును, మేలుగా=చక్కఁగా, సమభాగములు గూర్చి=సమాన భాగములు చేసి జలములన్ = నీటితో, కలియనూరి = కలియునట్లు నూరి, కణికలుగాఁ జేసి=కణికరూపముగాఁ జేసి, గాడ్పార్చి = గాలిలో నారఁబెట్టి, యువతుల=స్త్రీలయొక్క, చనుబాలనైనను=చనుబాలతోనైనను - మునగపూల = మునగపువ్వులయొక్క - రసముచేనైనను=రసముతోనైనను, గాచి=అరగదీసి, కన్నుల బెట్టిఁబెట్టివారికి=కనులకు బెట్టుకొనినవారికి ఈ సుదర్శనాంజనమునన్ = ఈ సుదర్శనమను పేరుగల కాటుకచే, నిశ్చయంబుగాన్ = తప్పక, శుక్లపటలమ్ములన్నియున్ = శుక్లనష్టముచేఁ గలిగిన నేత్రరోగములన్నియు, సుడిసిపోవును = నశించిపోవును, పొరలున్=కంటి పొగలును, తిమిరంబులు= చీకట్లుగా నుండుట, ఆవిరులు = కంటి కలఁకలును, పొలియున్= మాయమగును.

తా. మంచిగంధము, మణిశిల, సైంధవలవణము, అరదళము, శంఖము, యష్టిమధుకము, మిరియాలు, పటిక, సమభాగంబులు చేసి నీటితో నూరి కణికలు చేసి నీడ నారఁబెట్టి చనుబాలతోనైనను, మునగపువ్వు రసముతోనైనను, అరగదీసి కనులకు బెట్టినయెడల శుక్లపటలములను జబ్బులును, పొరలు, చీకట్లు గ్రమ్ముట కలఁకలును మానును.

4. శస్త్రివల్ల భాంజనము.

ఉ. సంకునుమున్గవిత్తులును సైంధవముందగఁ గోడిగ్రుడ్డుపై
పెంకుసముద్రఫేనమొగి ప్రేమజలంబుల నూరికన్నులం
గొంకకమున్గపూరసముఁ గూరిచివేసిన శస్త్రివల్లభం
బంకెకురాని శుక్లపటలాదులుమానును గోపవల్లభా.

టీ. సంకును = శంఖమును, మున్గవిత్తులు=మునగ విత్తులును, సైంధవమున్= సైంధవలవణమును, కోడిగ్రుడ్డుపై పెంకున్=కోడిగ్రుడ్డుమీఁది పెంకును, సముద్రఫేనము=సముద్రపు నురుగయును, తగన్=ఒప్పునట్లు, ఒగిన్=వరుసగా, ప్రేమన్=శ్రద్ధతో, జలంబుల నూరి=నీటితో నూరి, మున్గపూరసముఁ గూరిచి=మునగపువ్వు రసముంజేర్చి, కొంకక = సంశయించక, శస్త్రివల్లభంబు = శస్త్రివల్లభమను పేరుగల యంజనము, కన్నులన్ = నేత్రములకు, వేసినన్=పట్టించినయెడల గోపవల్లభా=కృష్ణమూర్తీ, అంకెకురాని=స్వాధీనముకాని, శుక్లపటలాదులు=శుక్లపటలము, రక్తపటలము మొదలగు జబ్బులు, మానును=పోవును.

తా. శంఖమును, మునగగింజలును, సైంధవలవణము, కోడిగుడ్డుమీఁది పెంకును, సముద్రఫేనమును, నీటితో నూరి మునగపువ్వు రసముం గలిపి కనులకుఁ బట్టించినయెడల శుక్లపటలము మొదలగు అసాధ్యపు నేత్రరోగములు మానును.

5. అమల కాంజనము.

ఉ. ఆమలకంబుమిర్యములు నారయగానుగవిత్తులొప్పుగా
సామమునందనందు గణసంఖ్యల గుంటకరాకు నీటితో
ప్రేమనునూరి కన్నులను బెట్టిననామలకాంజనంబుచేఁ
గామెరలక్షి రోగములు కాచలుతీటలు మానుఁగేశవా.

టీ. కేశవా=ఓవిష్ణుమూర్తీ, ఆమలకంబు = ఉసిరికయును, మిర్యములు=మిరియములును, కానుగ విత్తులును=కానుగ గింజలును, అరయన్=విచారించగా, ఒప్పుగాన్=చక్కఁగా, సామమునందన్ = ఉపాయముతో, అందున్=పయినఁ జెప్పిన వస్తువులయందు, గణ = పయినఁజెప్పిన వస్తుసమూహముయొక్క, సంఖ్యలన్=ఎన్నికతో (అనగా ఉసిరిక, మిరియములు, కానుగవిత్తులు వీనితోసరిగా) గుంటకరాకునీటితో= గుంటకలగరాకు రసముతో, ప్రేమను = శ్రద్ధతో, నూరి=అరగతీసి కన్నులను బెట్టినన్ = కనులయందుంచినచో, అమలకాంజనంబుచే = అమలకాంజనమువలన, కామెరలు=కామెరలను జబ్బులును, అక్షిరోగములు=తక్కిన నేత్రరోగములును, కాచలు=కాచరోగములును, తీటలు=కంటి దురదలును, మానును=పోవును.

తా. ఉసిరికయు, మిరియములును, కానుగ గింజలను, నొకవంతును, వీని యన్నిటి యెత్తు గుంటకలగరాకు రసముతో నూరి కనులకు బెట్టినయెడల కామెరలు, కాచలు, తీటలు మొదలయిన కంటిజబ్బులు పోవును.

6. శంఖాంజనము

ఉ. పాలిడిసైంధవమ్మునిరుపాలుమిరెంబులు నాల్గుపాళ్లుగాఁ
బోలఁగరక్తమణ్శిలయుఁ బొల్పుగనెన్మిదిపాళ్ళుశంఖమున్

మేలగు మేక పాలనవి మెత్తగనూరియుఁ గన్నులందిడన్
దూలలు, పూలు, కాయలను దుర్గుణముల్ హరియించు మాధవా

టీ. మాధవా = విష్ణుమూర్తి, సైంధవమ్ము = సైంధవలవణము, పాలిడి = ఒక పాలుంచి మిరెంబులు = మిరియములు, ఇరుపాలు = రెండుపాళ్ళును, రక్తమణ్శిలయున్ = రక్తమణిశిలయును నాలుగుపాళ్ళుగాన్ = నాలుగుపాళ్ళుగాను, పోలఁగన్ ఏర్పాటుచేయగా - పాల్పుగన్ = చక్కగా, ఎనిమిదిపాళ్లు = ఎనిమిది భాగములు, శంఖమున్ = శంకమును మేలగు = శ్రేష్టమయిన, మేకపాలన్ = మేకపాలచేత అవి = పయినజెప్పినవస్తువులు, మెత్తగన్ = మెత్తగ, నూరియున్ = కలియనూరి కన్నులందిడన్ = నేత్రములయందుంచినయెడల, దూలలు = నురదలును పూలు = కన్నులలో నిపువ్వులును, కాయలు = కంటికాయలు, అను = అనునట్టి, దుర్గుణములున్ = చెడుజబ్బుగుణములు, హరియించున్ = నశించును.

తా. కన్నులుదురదగలిగి యున్నను, పువ్వులు వేసినను, కాయలుకాచినను సైంధవలవణ మేకపాలును, మిరియములు రెండుపాళ్లును నాలుగుపాళ్ళు మణిసిలయు, ఎనిమిదిపాళ్ళు శంఖమును, మేకపాలతో నూరి కనులయందిడిన పయిన చెప్పిన దుర్గుణములు హరించును.

7. అభయాంజనము.

ఉ. నేతలవంగముల్పటిక నిప్పలమీఁదఁ నునాముదంబునన్
బ్రీతిహరీతకిన్ వెలయఁ జేర్చిసమంబుగ నావువెన్నతో
ధౌతపుకంచుపళ్ళెమునఁ దామ్రమునం దెగనూరివేయదు
ర్జాతపునేత్రరోగకులజాలముమానునురుక్మిణీశ్వరా.

టీ. రుక్మిణీశ్వరా = రుక్మిణీదేవికిఁ బ్రిభువగునోకృష్ణమూర్తీ, నేతన్ = నేతియందు లవంగముల్ = లవంగములును, నిప్పలమీదన్ = నిప్పలపైని, పటిక = పటికయు. ఆముదంబునన్ = ఆముదములో, ప్రీతిన్ = శ్రిద్ధతో, హరీతకిన్ = కరకకాయలను, వెలయన్ = ఒప్పునట్లు, చేర్చి = వేయించి, సమంబుగన్ = సమభాగములుగా, ఆవువెన్నతోన్ = ఆవువెన్నతోడ, ధౌతపుకంచు పళ్ళెమున్ = తెల్లనైన కంచుపళ్ళెమునందు, తామ్రమునన్ = రాగిచెంబుతో తెగనూరివేయన్ = ఖక్కిలిమెత్తగనూరి కనులనుఁ బట్టించఁగా దుర్జాతపు = దుష్టసంభవములయిన, నే

త్రరోగ = కంటిజబ్బులయొక్క, కుల = జాతులయొక్క, జాలము = సమూహము, మానును = నెమ్మదించును.

తా. నేతియందు లవంగములును, నిప్పలమీద పటికయు, ఆముదమున కరకకాయ వెచ్చులును, సమభాగములుగా వేయించి ఆవువెన్నతో కంచుపళ్లెమున రాగిముంతతో నూరి కనులకు పట్టించిన నేత్రరోగంబులన్నియును మానును.

8 శశిప్రభాంజనము.

చ. ఎనుబదినువ్వుపువ్వులును నేబది యేర్పడ జాజిపువ్వులు
న్వినుపదియారు మిర్యములు వేగమె పిప్పల కొమ్ములారున
ఘనముగనూరి కండ్లనిడఁగాఁ దిమిరంబులు వర్తిరోగముల్
జనును శశిప్రిభంబిది నిజంబుగ జాంబవతీ మనోహరా.

టీ. జాంబవతీ మనోహరా = జాంబవతీదేవి మనస్సును హరించిన కృష్ణమూర్తీ, వేగమే = త్వరలో, విను = ఆలకింపుము, ఎనుబదినువ్వుపువ్వులును, ఏర్పడన్ = ఏర్పాటుగా, ఏబది జాజి పువ్వులును-పదియారు మిర్యములు = పదునారుమిరియపుగింజలును, పిప్పలకొమ్ములు = పిప్పళ్ళు- ఆరునన్ = ఆరును- ఘనముగన్ = ఎక్కువగా- (అనఁగా మెత్తగా) నూరి = మర్దించి కండ్లనిడఁగాన్ కనులకుఁ బట్టించిన యెడల- తిమిరంబులు = కంచీకట్ల గ్రిమ్ముట- వర్తిరోగముల్ = కంటిపొరలలో వేయుజబ్బులు (అనఁగా కనులలో ఏడుపొరల లోభాగమునబుట్టుజబ్బులు) నిజంబుగన్ = సత్యంబుగా- చనును = పోవును. ఇది= ఈయంజనము- శశిప్రదంబు = శశిప్రిభయను పేరుగలది.

తా. 80 నువ్వుపువ్వులును, 50 జాజి పువ్వులును, 16 మిరియపు గింజలును, 6 పిప్పళ్ళును కలిపి మెత్తగానూరి కనులకుఁ బట్టించినయెడల కనులు చీకట్లు గ్రిమ్ముట కంటి పొరలలో బుట్టుజబ్బులును హరించును.

9. చంద్రప్రభావత్యంజనము.

సీ. మానిని తలపెంకు మణిశిల చిల్లగిం
జలుకోడిగ్రుడ్లపెంకులును వసయు
మున్నీటినురుగు నాముదపుపల్కులుమంచి
పిప్పళ్ళుసమభాగ మొప్పఁగూర్చి

లలితమౌమాదీఫలపునిమ్మరసములఁ
గలయమర్దనఁ జేసికడకుఁదీసి
తగినకోపులు చేసితడియార్చి యవిదాచి
యనుపానములతోడ నదనుకొలఁది
గీ. ఇట్టిచంద్రప్రభావతి నెనసికన్ను
గవలయందిడఁబువ్వులునవలుఁ బొరలుఁ
గాయలునుమానుదానవఘనసమీర
శ్రితజనాధారరుక్మిణీచిత్తచోర.

టీ. దానవ= రాక్షసులనెడి, ఘన =మేఘములకు- సమీర = వాయువువంటి వాఁడా- శ్రితజన = ఆశ్రితజనులకు, ఆధారమయినవాఁడా రుక్మిణీ = రుక్మిణీదేవి యొక్క- చిత్త = మనస్సును-చోర = హరించిన కృష్ణమూర్తి-మానిని తలపెంకు = స్త్రీయొక్క-తలపెంకును- మణిశిల = మణిశిలయు- చిల్లగింజలు = ఇందుపగంజలును (కతకము) కోడిగ్రుడ్లపెంకులును, వసయున్ = వసకొమ్మును- మున్నీటినురుగున్ = సముద్రఫేనమును ఆముదపుపల్కులు = ఆముదపుపప్పును-మంచి = ప్రశస్తమయిన పిప్పళ్లును- సమభాగము = సమానపుపాళ్ళు- ఒప్పన్ తగునట్లు- కూర్చి = చేర్చి- లలితమౌ = ఒప్పునట్టి- మాదీఫలము = మాదీఫలముయొక్కయు- నిమ్మ =నిమ్మపండ్లయొక్కయు-రసములన్ = రసములచేత కలయన్ = కలియునట్లు- మర్దనచేసి = మర్దించి- కడకుదీసి = తరువాత దానినిదీసి- తగిన = ఒకవిధముగా నొప్పినట్టి- కోపులు చేసి = కణికలు చేసి-తడియార్చి =ఆరబెట్టి-అవి = ఆకణికలు- దాచి =భద్రపరచి అదనుకొలదిన్ = సమయమునుబట్టి- అనుపానములతోడన్ = అనుపానములతో- ఇట్టి = ఈవిధమగు- చంద్రప్రభావతియను నంజనమును- ఎనసి =తీసికొని- కన్నుగవలయందిడన్ = రెండుకన్నులకును పట్టించినయెడల- పువ్వులు = పువ్వులును- నవలు = దురదలును- పొరలు = పొరలును కాయలును = కాయలును- మానున్ =మానును.

తా. ఆడుదాని తలపెంకును, మణిశిలయు ఇందుపగింజలును, కోడిగ్రుడ్ల పెంకులును, వసయు, సముద్రఫేనమును, ఆముదపు పప్పును, పిప్పళ్ళు, సమభాగములుగా మాదీఫలపురసము చేతను, నిమ్మపండ్లరసము చేతను నూరితీసి కణికలు చేసియుంచుకొని సమయమునుబట్టి అనుపానముతో కన్నులకుఁ బట్టించిన యెడల పువ్వులు, దురదలు, పొరలు, కాయలు మొదలయినవి పోవును.

10 అర్ధచంద్రోదయాంజనము.

సీ. శ్రీగంధమగురుమంజిష్ఠియిందుగువిత్త
నములునారతికర్పూరమునుమ్రాని
పసపుముస్తెలుగూడఁ బాలయుఁబటికశం
ఖముమండపసపునుకావిరాయి
సరిగూర్చియంతకు సరిమైలతుత్తము
నెసఁగగజంబీరరసముచేతఁ
దెగనూరికణికలింపుగఁ జేసికన్నులఁ
బానీయములఁజన్నుబాలనైన
గీ. నర్ధచంద్రోదయాంజనంబర్థివేయఁ
బుసులుకాయలుపటలముల్ నసలుపొరలు
వరుసగామానురామ శ్రీవత్సధామ
జలధరశ్యామదేవతాసార్వభౌమ.

టీ. శ్రీవత్స = శ్రీవత్సమనుచిహ్నముచే- ధామ =ప్రకాశించునట్టి వాఁడా- జలధర = మేఘమువంటి, శ్యామ = నల్లనిరూపముగలవాఁడా- దేవతాసార్వభౌమ = దేవతలలో శ్రేష్ఠుఁడా- రామ = ఓ శ్రీరామా- శ్రీగంధము = మంచిగంధమును- అగురు = అగురుగంధమును, మంజిష్ఠి = మంజిష్ఠమును- ఇందుగువిత్తనములున్ = ఇందుగకాయగింజలును. (వారిప్రసాధన) ఆరతికర్పూరమును = ఆరతికర్పూరమును- మ్రానిపసపు = మ్రానిపసపు- ముస్తెలు = తుంగదుంపలు-కూడన్ = కలియునట్లు-పాలయు = పాలసుగంధియు- పటిక = పటికయు శంఖమున్ = శంఖమును- మండ= ఉసిరికయు-పసుపును = హరిద్రయు- కావిరాయి = ఎఱ్ఱని సుద్దరాయియు, సరిగూర్చి = సమానభాగములుగాఁ జేసి అంతకుసరి = పయినజెప్పిన వస్తువుల భాగముల ప్రకారమే- మైలతుత్తము = మైలతుత్తమును- ఎసఁగగన్ = ఒప్పునట్లు- జంబీరరసముచేతన్ = నిమ్మపండ్లరసముతో - తెగనూరి = ఎక్కువగానూరి- ఇంపుగన్ = చక్కఁగా- కణికలు, చేసి = ఒనర్చి- కన్నులన్ = కనులయందు- పానీయములన్ = నీటితోనైనను చనుబాలనైనన్ = చనుబాలతోనైన అర్ధచంద్రోదయాంజనంబు = అర్ధచంద్రోదయమను పేరుగల కాటుకను- అర్థిన్ = కోరికతో- వే

యన్ = వేసినట్టయిన- పుసుఁబున్ = పుసులును- కాయము = కాయములును- పటలము లు = రక్తశుక్లాదిపటలములును- నసలున్ = దురదలును - పొరలు = పొరలును- వరుసగా = క్రమముగా- మానున్ = నివర్తించును.

తా. మంచిగందము, అగరును, మంజిష్ఠమును, ఇండుపదింజలును, ఆరతి కప్పూరమును, ప్రానిపసపును, తుంగముస్తలును, పాలసుగంధియు, పటికయు, శంఖమును, ఉసిరికపప్పును, పసపును, ఎఱ్ఱనిసుద్దరాయియు, మైలుతుత్తమును, సమభాగములు చేసి నిమ్మపండ్ల రసముతో పాకముగా నూరి కణికలు చేసి నీటితో గాని చనుబాలతో గాని అరగదీసి కనులకుఁబట్టించినచో పుసులు, కాయలు, పటలములు, దురదలు, పొరలును మానును.

11 నయనామృతాంజనము.

చ. అరయఁగతుత్థయుగ్మమురసాంజనసైంధవసింధుఫేనముల్
మిరియముటంకణంబునిడిమెత్తగనిమ్మలపండ్లనీటిచే
నరయగనూరినట్టినయనామృతమొప్పఁగఁగన్నులందిడన్
బొరలుసుపూలుపొక్కులునుపుండునుదూలలడంగుమాధవా.

టీ. మాధవా = విష్ణుమూర్తీ, అరయగన్ = ఆలోచించఁగా, తుత్థయుగ్మమున్ = మైలుతుత్తము, పాలతుత్థమును, రసాంజన = ఇంగిలీకమును, సైంధవసింధుఫేనముల్ = సైంధవలవణము సముద్రపునురుగును, మిరియము=మిరియములును, టంకణంబున్ = వెలిగారమును, ఇడి = సమానభాగములుగానుంచి, మెత్తగన్= మెత్తగా, నిమ్మపండ్లనీటిచేన్ = నిమ్మపండ్లరసముతో. అరగఁగన్ = అరుగునట్లు, నూరినట్టి = మర్దనచేసినటువంటి, నయనామృతము = నయనామృతమనునంజనము ఒప్పఁగన్ = ఒప్పునట్లు, కన్నులందిడన్ = కనులయందుపట్టించినయెడల, పొరలును, పూలు = పువ్వులును, పొక్కులును = పొక్కులును, పుండ్లును = కురుపులును, దూలలు = దురదలును, అడంగున్ = అడగిపోవును.

తా. మైలుతుత్తము, నీలితుత్తము, రసాంజనము, సైంధవలవణము, సముద్రపునురుగు, [illegible]ములు, వెలిగారము, నిమ్మపండ్లరసముతో నూరి కనులయందుఁబెట్టిన యెడల పొరలును, పువ్వులును, పొక్కులు, పుండ్లు, దురదలుపోవును.

12 మూరిదాంజనము.

ఉ. కర్పరమైలతుత్థములుగజ్జెరుశంఖరసాంజనంబులన్
నేర్పుగనబ్ధిఫేనముమణిశ్శిలయుం ద్రిఫలమ్ములొక్కయె
త్తేర్పడనిమ్మపండ్లరసమిచ్చుచు నూరియుఁగన్నులందిడన్
మార్పడునేత్రరోగములుమంటలుపూవులుమాను కేశవా.

టీ. కేశవా = విష్ణుమూర్తీ, కర్పరమైలుతుత్తములు = దలపుర్రె, మైలుతుత్తమును గజ్జెరు = గజ్జేరును, శంఖరసాంజనంబులున్ = శంఖము, రసాంజనమును, నేర్పుగన్ = జాగ్రత్తతో అబ్ధిఫేనము = సముద్రపునురుగును, మణిశ్శిలయున్ = మణిశిలయును, త్రిఫలమ్ములు = కరకతాడియుసిరికలును, ఒక్కయెత్తు = సమభాగము, ఏర్పడన్ = ఏర్పాటుగా, నిమ్మపండ్లరసము = నిమ్మపండ్లనీరు, ఇచ్చుచు = పోయుచు నూరియు = మర్దనచేసి, కన్నులందిడన్ = కండ్లకుఁబట్టించినయెడల, మార్పడు= రూపుమారు, నేత్రరోగములు = కనులజబ్బులు, మంటలు, పువ్వులు, మానున్ = మానిపోవును.

తా. తలపెంకు, మైలుతుత్థము, గజ్జేరు, శంఖము, రసాంజనము, సముద్రపుసురుగు, మణిశిల, కరకతాడియుసిరికలు- సమానభాగములుచేసి నిమ్మపండ్లరసముతో నూరి కనులకుఁ బట్టించిన యెడల, అందవిహీనముచు తెచ్చు నేత్రరోగములు, మంటలు, పువ్వులు, నివర్తించును.

13. తిలకాంజనము.

చ. క్రిమమునసల్లమిర్యములుగర్పరముందగనువ్వుపువ్వులన్
హిమకరనేత్రవేదములనేర్పడఁబాల్లిడినిమ్మపుల్సుచే
నమరగనూరిపట్టితిలకాంజనమక్షులయందుఁబెట్టినం
దిమిరముబుద్బుదంబులునుదీటలుపూవులుమానుకేశవా.

టీ. కేశవా = విష్ణుమూర్తీ, నల్లమిర్యములు = నల్లమిర్యములును, కర్పరమున్ = తలపుర్రెయు నువ్వుపువ్వులన్ = నూవుపువ్వులును, తగన్ = బాగుగ, హిమకర = ఒకపాలును, నేత్ర = రెండుపాళ్ళును, వేదములన్ = నాలుగుపాళ్ళును,

* త్రిఫల = కరకతాడియుసిరకలు త్రిఫల= ద్రాక్షాకాశ్మర్యఖర్జూరఫలములు త్రిఫల = జాతీలవంగపూగఫలములు. ఇవివైద్యపరిపాటిఁగనివాడుకొనవలెను.

క్రమముగన్ = వరుసగా, ఏర్పడన్ = ఏర్పాటుగా, పాళ్ళిడి = భాగముల్లుచేసి, నిమ్మపుల్సుచేన్ = నిమ్మపండ్లరసముతో, అమరగన్ = శ్రద్ధతోకలియునట్లు, నూరినట్టి = మర్దించినట్టి, తిలకాంజనము = తిలకమను పేరుగల యీ కాటుక, అక్షులయందున్ = కనులయందు, పెట్టినన్ = పట్టించినయెడల, తిమిరము = చీకట్లుగ్రమ్ముటయు, బుద్బుదంబులున్ = నీరుబుట్టుటయును, తీటలు = దురదలును పూవులు = పువ్వులును, మానున్ = నివర్తించును.

తా. ఒకపాలు నల్లమిరియములను రెండుపాళ్లు పురిపెంకును నాలుగు పాళ్ళునువ్వుపువ్వును, నిమ్మపండ్లరసముతో నూరి కనులకు బెట్టినయెడల కనుల చీకట్లుగ్రమ్ముట నీరుబట్టుటయును, దురదలును, పువ్వులునుమానును.

14 స్ఫటికాంజనము

సీ. పటికలొద్దుగచెక్కకటుత్రయమురసాం
జనమునుగఫరియుసైంధవమును
మాయూరతుత్థంబు మధుకవిళంగముల్
గానుగవిత్తులుకరకకాయ
బరడువంగముసీసభస్మంబుచక్కెర
పానకంబుననిమ్మపండ్లరసము
కలగరరసమునఁగలియగమర్దించి
కణికలుగాఁజేసికనులనిడిన

గీ. పువ్వులెరుపులుదూలలుపుసులుపసిరి
కలునుదుర్మాంసపటలకాచలునుమాను
నవనిస్ఫటికాంజనంబిదిహతవిరాధ
ఆశ్రితామరయూథలోకైకనాథ.

టీ. హతవిరాధ = విరాధునిసంహరించిన వాడా, ఆశ్రిత = ఆశ్రయించఁబడిన అమరయూథ = దేవసమూహము గలవాడా, లోకైకనాథ = లోకములన్నిటికి నొక్కడికే ప్రభువైన విష్ణుమూర్తీ పటిక = పటికయు లొద్దుగచెక్క = లొద్దుగచెట్టుపట్టయును, కటుత్రయము = శొంటిపిప్పలి మిరియములును- రసాంజనమును = ఇంగిలీకమును -కఫరియు = పాలతుత్థమును సైంధవమును = సైంధవలవణమును- మయూరతుత్థంబు = మైలుతుత్థమును- మధుక = యష్టిమధుకము- విళంగములు = వాయువిలంగములును- గానుగవిత్తులును = గానుగగింజలును - కరకకాయబరడు-వంగభస్మము- సీసభస్మము- చక్కెరపానకంబునన్ = చక్కెరతోఁ చేసినపానకముతో- నిమ్మపండ్లరసముతోడను- కలగరరసమునన్ = గుంటగలగరసముతోడను - కలియంగమర్దించి = కలియునట్లునూరి- కణికలుగాఁజేసి- కనులనిడినన్ = కనులకు పెట్టగా- పువ్వులు- ఎఱుపులు- దూలలు-దురదలును-పుసులును, పసిరికలు = పచ్చదనమును- దుర్మాంస = కొయ్యగండలు పెరుగుటయు- పటల = పొరలజబ్బులను - కాచలు = నాలుగువిధములగు కాచరోగములును- అవనిన్ = ఈప్రపంచమునందు- స్ఫటికాంజనము = స్ఫటికాంజనమను పేరుగల ఇది = ఈయౌషధమువలన- మానును = మానిపోవును.

తా. పటిక లొద్దుగచెక్క, కరకతాడి యపసిరికలు, ఇంగిలీకము, పాలతుత్తము, సైంధవలవణము, మైలుతుత్తము, యష్టిమధుకము, వాయువిళంగములు, గానుగవిత్తులు కరకకాయపెచ్చులు, వంగభస్మము, సీసభస్మము చక్కెరపానకముతోను నిమ్మపండ్లరసముతో గుంటకలగరాకురసముతో నూరికణికలుచేసి అరగదీసి కనులకుఁబెట్టిన యెడల పువ్వులు, యెరుపులు, దురదలు, పుసులు పసరికలు, కొయ్యగండలు పటలరోగములు కాచలును మానును.

15. కతకాంజనము.

సీ. చిల్లవిత్తులుమణిశిలనాభిశంఖంబు
సైంధవమ్మునురసాంజనసముద్ర
ఫేనంబులునుశొంఠిపిప్పలిమిరియముల్
కొత్తివిళంగముల్ కోడిగుడ్ల
పెంకులుసరిగూర్చిప్రీతితోజంబీర
ఫలరసంబున మోదమలరనూరి
కణికలుగాఁజేసిగాడ్పార్చి తేనెతో
ననువొప్పగాఁగన్నులందునిడిన

గీ. తిమిరపటలంబులును గాచసముదయంబు
వర్తిరోగగణంబులుద్వృత్తిఁబుసులు
విమలముగమానుగతకాంజనముసీశ
యఖిలలోకేశశ్రీకృష్ణయఘవినాశ.

టీ. చిల్లవిత్తులు = ఇందుపగింజలు మణిశిల = మణిశిలయు- నాభి = నాభియు- శంఖంబు = శంఖభస్మమును- సైంధవమ్మును = సైంధవలవణమును - రసాంజన = ఇంగిలీకమును, సముద్రఫేనంబు = సముద్రపునురుగును- శొంఠి = శొంఠియు-పిప్పలి = పిప్పలికట్టెయు-మిర్యముల్ = మిరియములును- క్రొత్తవిళంగముల్ = శుభ్రమగు వాయువిళంగంబులును- కోడిగుడ్ల పెంకులును- సరిగూర్చి = సమానభాగములు చేసి, వృద్ధితో = శ్రద్ధతో- జంబీరఫలరసంబునన్ = నిమ్మపండ్లరసముతోడను - మోదమలరన్ = బాగుగా - నూరి = మర్దించి- కణికలుగాఁజేసి- గాడ్పార్చి = నీడనారబెట్టి తేనెతోన్ = మధువుతో - అరగదీసి - అనువొప్పగాన్ = చక్కఁగా - కన్నులందున్ = నేత్రములయందు - ఇడినన్ = పెట్టినయెడల- తిమిర = చీకట్లును - పటలంబులును = పొరలును- కాచసముదయమును = కాచరోగసమూహమును-ఉద్వృత్తి = ఎక్కువగా - వర్తిరోగ గణంబులు = వర్తియను పేరుగల (ఏడుపొరలలోఁబుట్టురోగము) రోగసముదాయములును, పుసులు, ఈకతకాంజనమునన్ = ఈకతకమను పేరుగల కాటుకచేత, ఈశ, అఖిలలోకేశ, అఘవినాశ = పాపములనుపోగొట్టువాఁడా, శ్రీకృష్ణ = కృష్ణమూర్తి, విమలముగన్ = నిశ్శేషముగా, మానున్ = నివర్తించును.

తా. ఇందుపగింజలు, మణిశిల, నాభి, శంఖభస్మము, సైంధవలవణము, ఇంగిలీకము, సముద్రపునురుగు శొంఠి పిప్పలి మిర్యములు వాయువిళంగములు, కోడిగుడ్లపెంకులును, సమానభాగములుగాచేసి, నిమ్మపండ్లరసముతోనూరి కణికలుచేసి నీడనారనిచ్చి తేనెతోనూరి కనులకుఁబట్టించినయెడల చీకట్లు, పొరలు కాచలు వర్తిరోగములు పుసులును మానును.

16 హరిద్రాభాంజనము.

సీ. మంచిపసపురక్త మణిశిలపిప్పళ్ళు
నల్లనిమిర్యముల్ నాభిశంఖ

వేపయిగురుతాడివిత్తులుకానుగ
విత్తులపల్కులొక్కొత్తుమేక
పంచితంబునఁగానిపాలతోడనుగాని
మూఁడుపొద్దులు నూరిముఖ్యముగను
కణికలుగావించిగాడ్పార్చినీడను
పానీయమునసైనఁదేనెనైనఁ

గీ. గన్నులకువేయదురదలుకాచలెరుపు
పొరలుపొక్కులుపుసులునుపూలుకూన
లంటులడఁగించునీహరిద్రాభనామ
కాంజనంబునవికసితకంజనయన.

టీ. వికసిత = వికసించిన - కంజ = పద్మమువంటి - నయన= నేత్రములుగల విష్ణుమూర్తీ ! మంచిపసపు, రక్తమణిశిల, పిప్పళ్ళు, నల్లనిమిర్యముల్ = నల్లనిమిరియములును - నాభి - శంఖంబు = శంఖభస్మము - వేపయిగురు= వేపచిగుళ్ళును - తాడివిత్తులు - కానుగవిత్తుల పల్కులు - ఒక్కొత్తు = ఒక్కొక్క భాగము - మేకపంచితంబునఁగాని - పాలతోడనుగాని మూఁడుపొద్దులు = మూడు దినములు - నూరి = మర్దనచేసి - ముఖ్యముగను = ప్రశస్తముగా కణికలుగావించి = కణికలుగాఁజేసి - నీడను - గాడ్పార్చి = గాలినారబెట్టి - పానీయమునసైనన్ =నీటితోనైనను - తేనెనైనన్ = తేనెతోనైనను - కన్నులకువేయన్ = కనులకు నూరిపట్టించినయెడల - దురదలు - కాచలు= కాచరోగములు - ఎరుపుపొరలు=ఎఱ్ఱనిపొరలును పొక్కులు - పుసులు - పూలు=పువ్వులు - కూనలు=కనులలోవేయు కూనలను జబ్బులును, అంటులు= అంటుకొనుటలును - ఈహరిద్రాభనామ కాంజనంబునన్ - ఈచెప్పినహరిద్రాభ మను పేరుగల కాటుకచేత - అడఁగించున్ = నివారించును.

తా. ఒక్కొక్కభాగము సరిగామంచిపసపు, రక్తమణిశిల, పిప్పళ్లు, నల్లమిర్యములు నాభి, శంఖభస్మము, వేపచిగుళ్ళు, తాడిగింజలు, గానుగగింజలు, మేకపంచితముతోనైనను లేక పాలతోనైనను మూడుదినములునూరి కణికలుచేసి నీడనారబెట్టి నీళ్ళతోనైన తేనెతోనైన అరుగదీసి కనులకుఁబట్టించినయెడల దురదలు, కాచలు, ఎరుపుపొరలు- పొక్కులు- పుసులు పువ్వులు, కూనలు అంటుకొనుట మానును.

17 అమృతాంజనము.

సీ. ఆరతికర్పూరమబ్ధిఫేనమునాభి
శంఖంబుపసపునుసైంధవమున
మైలుతుత్తముయష్టిమధుకంబురోహిణి
మంచిగంధమ్మునుమ్రానిపసపు
కటుకత్రయమ్మును గవ్వలునీలాంజ
నంబునుగరుడాంజనమ్ముసమము
మాతులుంగరసమ్ముచేతనుమర్దించి
కణికలుగాఁజేసికన్నులందు

తేనెనైనను మరి నేతినైననుఁగానిఁ
గలిపివేసిన నయనరోగములనణఁచుఁ
గాననయనామృతంబిది కమలనేత్ర
చారుతరగాత్ర క్షీరాబ్ధిజాకళత్ర.

టీ. కమలనేత్ర = పద్మములవంటి నేత్రములుగలవాఁడా, చారుతర = మిక్కిలిసుందరమయిన, గాత్ర = శరీరముగలవాఁడా, క్షీరాబ్ధిజాకళత్ర = లక్ష్మీదేవి భార్యగాఁగల విష్ణుమూర్తి - ఆరతికర్పూరము = ఆరతికర్పూరమును - అబ్ధిఫేనము = సముద్రపునురుగును - నాభి= నాభియును - శంఖంబు= శంఖభస్మము, పసుపును, సైంధవమును = సైంధలవణమును, మైలుతుత్తము యష్టిమధుకంబు, రోహిణి = కటుకరోహిణియు మంచిగంధమ్మును = మంచిగంధమును, మ్రానిపసపు, కటుకత్రయమ్మున్ = శొంఠిపిప్పలి మిరియములును, గవ్వలు = గవ్వభస్మము (వరాటభస్మము) నీలాంజనంబును గరుడాంజనమ్మును, సమము = సమానభాగములు, మాతులుంగరసమ్ముచేత = మాదీఫలరసముచేతను, మర్దించి = నూరి, కణికలుగాజేసి, తేనెనైనను = తేనెతోనైనను, మఱి=లేక, నేతనైనఁగాని = నేతితోనైనను, కలిపి = అరగదీసి కన్నులందు, వేసినన్ = వేసినయెడల, నయనరోగములన్ = కంటిజబ్బులను, అణఁచుఁగానన్ = పోఁగొట్టునుగావున, ఇది = ఈయౌషధము, నయనామృతము = నేత్రములకు అమృతమువంటి కాటుక,

తా. ఆరతికర్పూరము, సముద్రపునురుగు, నాభి, శంఖభస్మము, పసపు, సైంధవలవణము, మైలుతుత్తము, యష్టిమధుకము, కటుకరోహిణి, మంచిగంధము,

మ్రానిపసపు, శొంఠిపిప్పలి మిరియములు, వరాటభస్మము, నీలాంజనము, గరుడాంజనము, సమభాగములుచేసి మాదీఫలరసముతో నూరి, కణికలుజేసి తేనెతోనైనను నేతితోనైనను అరగదీసి కనులకుఁబట్టించినయెడల నేత్రరోగములుమానును.

18 వ్యోషాంజనము.

సీసమాలిక.

మాయూరతుత్థంబు మ్రానిపసుపురోహిణి,
ప్రత్యేకమొక్కొక్క పాలుదవరఁ
బసుపులొద్దుగదానిమ్మ పండ్లుకొబ్బరిమంచి
గంధమువసయునుగావిఱాయి
చందనంబునురసాంజనమునువేర్వేఱ
రెండేసిభాగంబులుండనొసఁగి
మూ[illegible]భాగముల్ ముఖ్యంబుగాఁదామ్ర
మునొగిఁబటికయునుబుండరీక
మునినాభిశంఖంబునునుయష్టిమధుకంబు
సైంధవలవణంబు సరవిఁగల్పి
నాల్గేసిపాళ్ళుగానక్కరవిత్తులు
కాన్గుత్రిఫలవిళంగత్రికటుక
మొసఁగికానుగవ్రేళ్లరసమునమర్దించి
కణికలుగాఁజేసికనులనిడినఁ
గనులరోగంబులుకాచులుపువ్వులు
మంటలంటులునుదుర్మాంసములును
గ్రంధులెరుపులుకూనలు కాయలర్బు
దములుమందాక్షులునుబుద్బుదములునీరు
నసలుమానును వ్యోషాంజనమునసిశ
దళితభవపాశ వరసుదంతాహ్వాదీశ.

టీ. మయూర తుత్థంబు = మయిలు తుత్థమును, మ్రానిపసుపు = మ్రానిపసుపును, రోహిణి = కటుకరోహిణియు, ప్రత్యేకము ఒక్కొక్కపాలు = ఒక్కొక్క

భాగము - తవరన్, పసపు, లొద్దుగ = లొద్దుగచెక్క, ద్రాక్షపండ్లు, కొబ్బరి, మంచిగంధము, వసయును, కావిరాయి, జేగురురాయి, చందనంబును = హరిచందనంబును, రసాంజనమును = ఇంగిలీకమును, వేర్వేఱన్ = వేరువేరుగా, రెండేసి భాగములు, ఉండన్ = ఉండువట్లు, ఒసఁగి = ఉంచి, ముఖ్యముగాన్ = సరిగా, తామ్రమున్ = తామ్రభస్మమును, ఒగిన్ = వరుసగా, పటికయున్ = పటికయును, పుండరీకమును = తెల్లతామరయు, నాభి, శంఖంబునున్ = శంఖభస్మమును, యష్టిమధుకంబు, సైంధవలవణంబున్ = సైంధవలవణమును, మూడేసి భాగములు, సరవిన్ = క్రమముగా, కల్పి = కలిపి, నక్కెరవిత్తులు = నక్కెరగింజలును, కాన్గు = కానుగగింజలు, త్రిఫల = కరకతాడియుసిరికలును, విళంగ = వాయువిళంగములును, త్రికటుకము = శొంఠిపిప్పలిమిరియములును, నాల్గేసిపాళ్ళుగాన్ = నాలుగేసిభాగములుగా ఒసఁగి = ఉంచి, కానుగవ్రేళ్లరసమునన్ = గానుగవేళ్ళరసముతో, మర్దించి = నూరి, కణికలుగాఁజేసి = కణికలుగానొనర్చి, కనులనిడినన్ = కనులకు బెట్టినయెడల, కనులరోగంబులు = నేత్రవ్యాధులగు, కాచలు = కాచరోగములు, పువ్వులు మంటలు అంటులును = అంటుకొనుటలును, దుర్మాంసములును = కొయ్యగండలు పెరుగుటయు, గ్రంథులు = రెప్పలమీఁద ముళ్ళుగా కాయు కాయలు (అగ్నిగ్రంథులు) ఎఱుపులు = యెఱ్ఱబడుటయు, కూనలు కాయలు అర్బుదములు = పద్మార్బుదములను రోగ విశేషములును మందాక్షులును = కనులు మందము గలిగియుండుటయు, బుద్బుదములు = పొంగరించుట, నీరు = నీరుపట్టుట, నసలు = దురదలు, వ్యోషాంజనమునన్ = ఈవ్యోషమను పేరుగల కాటుకచేత, మానును = నివారించును.

తా. మైలుతుత్తమును, మ్రానిపసపు, కటుకరోహిణి, వేరుగాఒక్కొక్క భాగమును, పసపు, లొద్దుగచెక్క, ద్రాక్షపండ్లు, కొబ్బరి, మంచిగందము, వస, జేగురురాయి హరిచందనము, ఇంగిలీకము వేరువేరుగా రెండేసిపాళ్లును, తామ్రభస్మము, పటిక, తెల్లతామర, నాభి, శంఖభస్మము, యష్టిమధుకము, సైంధవలవణము, మూడేసిపాళ్ళను, వరుసగాకలిపి నక్కెరగింజలు, గానుగగింజలు, కరకతాడియుసిరికలు, వాయువిళంగములు, శొంఠి పిప్పలి మిరియములు, నాలుగేసిపాళ్ళను చేసి కానుగవ్రేళ్ళరసముతో మర్దించి కణికలుచేసి కనులకుఁ బట్టించిన యెడల కాచలు, పువ్వులు, మంటలు, అంటుకొనుట, కొయ్యగండలు పెరుగుట, రెప్పలపయి ముళ్ళుగాకాయు కాయలు, ఎఱ్ఱబడుట కూనలు గుడ్డుమీఁదికాయలు, పద్మార్బు

దములను రోగములు, కనులమందము, పొంగరించుట, నీరుపట్టుట, దురదలును మానును.

19 విద్రుమాంజనము.

సీసమాలిక.

అమరంగసీసవిద్రుమతామ్రపారద
   ములవిభూతులుఁదుంగముస్తలెసఁగ
గరకకాయలుతెల్లగంటెలవిత్తులు
   చింతగింజలుపుత్రజీవిగడ్డ
కాసీసమునుగటుకత్రయమ్మునురసాం
   జనమునులొద్దుగసైంధవమును
మాయూరతుత్తంబుమలచిజేగురురాయి
   సవ్వీరాంజనమునుసమముగూర్చి
వేపాకురసమున వెలయనూరినముద్ద
   బాగుమీఱఁగరాగిపళ్ళెరమ్ము
పైనుంచితేనెనాపైఁబోసియదిరాగి
   ముంతచేమర్దించిముఖ్యముగను
కనులబెట్టినవిషరోగగణముమతియుఁ
బువ్వులనురెప్పదురదలపోఁడిమాఁచు
విద్రుమాంజనమిదియగువిహగవాహ
వితతచారిత్రశతపత్రవిమలనేత్ర.

టీ. వితత = మిక్కిలిఘనమయిన, చారిత్ర = చరిత్రముగలవాఁడా! శతపత్ర = తామరరేకులవంటి, విమల = స్వచ్ఛమయిన, నేత్రా = నేత్రములుకలవాఁడా! విహగవాహ = పక్షియేవాహనముగాఁగల విష్ణుమూర్తీ! అమరంగన్ = ఒప్పునట్లు, సీస = సీసముయొక్కయు, పారద = పాదరసముయొక్కయు, విభూతులున్ = భస్మములును, తుంగముస్తలు = తుంగదుంపలు ఎసగన్ = ఒప్పునట్లు కరకకాయలు, తెల్లగంటెవిత్తులు, చింతగింజలు, పుత్రజీవిగడ్డ = పుత్రజీవియను చెట్టుయొక్కదుంపగాను, కాసీసమును = పాలతుత్తమును, కటుకత్రయమ్మును = శొంఠిపిప్పలి మిరియము

లును, రసాంజనమును ఇంగిలీకమును, లొద్దుగ = లొద్దుగచెక్కయు, సైంధవము ను = సైంధవలవణమును, మాయూరతుత్థంబు = మైలుతుత్తమును, మంచిజేగురుఱా యి, సవ్వీరాంజనము = సౌవీరాంజనమును, సమముగూర్చి = సమానభాగములు చేసి, వేపాకురసమునన్ = వేపాకురసముచేత, వెలయన్ = చక్కఁగా, నూరినముద్ద = నూరినట్టిముద్ద, బాగుమీఱఁగన్ = నేర్పుతో, రాగిపళ్ళెరముపైన్ = రాగిపళ్ళెము మీఁద, ఉంచి = పెట్టి, ఆపైన్=దానిమీఁద తేనెన్ = తేనెను, పోసి, అది=ఆము ద్దను, రాగిముంతచేన్ = రాగిచెంబుచేత, మర్దించి = నూరి, ముఖ్యముగన్= శ్రద్ధ తో, కనులఁబెట్టినన్ = కనులకుఁ బట్టించినయెడల, విషరోగగణము = దుష్టరోగస ముదాయమును, మఱియున్ = ఇంతియేకాక, పువ్వులను = కనులలోవేయు పువ్వుల ను, రెప్పదురదల = రెప్పలలోని దురదలయొక్కయు, పోణిమి = ఔన్నత్యమును, అణంచున్ = అణచివేయును, ఇది = ఈయౌషధము, విద్రుమాంజనము= విద్రుమాం జనమను పేరుగలది.

తా. సీసభస్మము, పగడభస్మము, తామ్రభస్మము, పాదరసభస్మము, తుంగ దుంపలు, కరకకాయలు, తెల్లగంటెలు, చింతగింజలు, పుత్రజీవిగడ్డ, పాలతుత్త ము, శొంఠి పిప్పలి మిరియములు, ఇంగిలీకము లొద్దుగచెక్క సైంధవలవణము మైలుతుత్తము, జేగురుఱాయి, సౌవీరాంజనము, సమానభాగములు చేసి, వేపాకుర సముతో నూరి ముద్దచేసి, యాముద్దను రాగిపళ్ళెముమీఁద పెట్టి తేనెవేసి రాగిముంత తో మర్దించి దానిని కనులకుఁ బట్టించినయెడల కనులకుగలుగు చెడుజబ్బులను, పువ్వులను, రెప్పలలోని దురదలను పోగొట్టును.

20 గరుడాంజనము.

సీసమాలిక.

ఏలకుల్ పటికమిర్యాలులక్కయుమంచి
గంధంబుపసపుఁజెంగల్వకోష్టుఁ
దలపెంకుఁగోడిగుడ్డులపెంకులునునాభి
శంఖరసాంజన సైంధవములు
మాయూరతుత్థంబు మణిశిలచిల్లగిం
జలు దేవదారు గుగ్గిలరసాంజ

నములుసముద్రఫేనము విష్ణుక్రాంతయు
నారతికర్పూర మమరఁగూర్చి
మేకపాలనునీలియాకులరసమున
గుంటకల్గరపొన్నగంటితెల్ల
గలిజేరురసములఁగలయంగమర్దించి
కణికలుగావించి గాడుపార్చి
యనుకూలమయినట్టి యనుపానములకొద్ది
సవరణగాఁగన్నుఁగవలనిడిన
దురదలుపటలముల్ దుర్మాంసములుకాయ
లిరుకులుపొక్కులుపొరలుపూలు
కోడిరెప్పలు రేజీకుఁగుటిలరోగ
గణములనుబాపి కలిగించుగరుడదృష్టిఁ
గానగరుడాంజనంబండ్రుగరుడవాహ
సంతతోత్సాహఘసనిభ శ్యామదేహ.

టీ. సంతతోత్సాహ = ఎల్లప్పుడును ఉత్సాహముతోఁగూడుకొనినవాఁడా! ఘన = మేఘముతో, నిభ = సమానమయిన, శ్యామ = నల్లనయిన, దేహ = శరీరము గలవాఁడా! గరుడవాహ = గరుత్మంతుడే వాహనముగాఁగలవిష్ణుమూర్తీ! ఏల కుల్ = ఏలకులును, పటిక, మిర్యాలు = మిరియములును, లక్కయును, మంచిగంధం బు = మంచిగంధమును- పసపున్ = పసపును, చెంగల్వకోష్టున్ = చెంగల్వకోష్టును తలపెంకున్ = తలపెంకును, కోడిగుడ్డులపెంకులును, నాభి, శంఖ = శంఖభస్మము ను, రసాంజన సైంధవములు = ఇంగిలీకము, సైంధవలవణమును, మాయూరతుత్థం బు = మైలుతుత్తము, మణిశిల, చిల్లగింజలు = ఇందుపగింజలు, దేవదారు = దేవదా రుచెక్కయు, గుగ్గిల = గుగ్గిలము, రసాంజనము, రసాంజనమును, సముద్రఫేన ము = సముద్రపునురుగు, విష్ణుక్రాంతయున్ = విష్ణుక్రాంతయును, ఆరతికర్పూర ము, అమరన్ = చక్కఁగా, కూర్చి = చేర్చి, మేకపాలను = మేకపాలతోడను, నీలియాకురసమునన్ = నీలియాకు రసముతోను, గుంటకల్గర = గుంటకలగరయొక్క యు, పొన్నగంటి = పొన్నగంటియొక్కయు తెల్లగలిజేరుయొక్కయు, రసములన్ = రసములతో, కలియంగన్ = కలియునట్లు, మర్దించి- నూరి - కణికలు గావించి కణిక

లుగాఁజేసి- గాడుపార్చి = నీడఁబారఁబెట్టి - అనుకూలమయినట్టి = తగినట్టి- అనుపానములకొద్దిన్ = అనుపానములనుబట్టి- సవరణగాన్ = సరిగా- కన్నుగవలన్ = కనులయందు- ఇడినన్ = పెట్టినయెడల- దురదలు, పటలముల్ = పటలరోగములు, దుర్మాంసములు, కాయలు, ఇరుకులు, పొక్కులు, పొరలు, పూలు, కోడిరెప్పలు, రేయీను = రాత్రులయందు నేత్రములు గాన్పించకుండుట కుటిలరోగగణములను = దుష్టరోగసమూహములను, పాపి = పోఁగొట్టి, గరుడదృష్టిన్ = గరుత్మంతునిచూపుతో సమానమయిన చూపును, కలిగించున్ = చేయును, కావునన్ = కాఁబట్టి, ఇది = ఈయౌషధము, గరుడాంజనంబండ్రు = గరుడాంజనమని చెప్పెదరు.

తా. ఏలకులు, పటిక, మిరియాలు, లక్క, మంచిగంధము, పసపు, చెంగల్వకోష్టు, తలపెంకు, కోడిగ్రుడ్లపెంకులు, నాభి, శంఖభస్మము, ఇంగిలీకము, సైంధవలవణము, మైలుతుత్తము, మణిశిల, ఇండుపగింజలు దేవదారుచెక్క, గుగ్గిలము, రసాంజనము, సముద్రపునురుగు, విష్ణుక్రాంతము, ఆరతికర్పూరము, ఇవియన్నియు సమానముగాచేర్చి మేకపాలతోను, నీలియాకురసముతోను, గుంటకలగరరసముతోను, పొన్నగంటిరసముతోను, తెల్లగలిజేరురసముతోను, కలియునట్లుగా నూరి, కణికలుచేసి నీడ నారఁబెట్టి తగినయనుపానముతో, కనులయందు బెట్టినయెడల, దురదలు, పటలములు, దుర్మాంసములు, కాయలు, ఇరుకులు, పొక్కులు, పొరలు, పువ్వులు, కోడిరెప్పలు, రాత్రికన్నులు కాన్పించకుండుట, మరియు దుష్టరోగములన్నియుఁ బోఁగొట్టి గరుత్మంతునిదృష్టిని గలుగఁజేయును.

21 మహాగరుడాంజనము.

సీసమాలిక.

వినుముసీసమురాగియినుపవిభూతులు
కటుకరోహిణివసకడలినురుగు
మైలుతుత్తమురక్తమణిశిలమధుకంబు
పటికమానిసిపుఱ్ఱెపాదరసము
త్రికటుకటంకణత్రిఫలంబులునునాభి
శంఖంబువచ్చనిసైంధవమును

గవ్వలునారతికర్పూరమునురసాం
జనమునుచిల్లగింజలునుగూర్చి
కల్వంబునందుంచిగానుగచెక్కరసంబు
చేనూరికణికలుచేసిదాచి
ముద్గమాత్రముతోయమునఁదీసియీమహా
గరుడాంజనముకన్నుగవలనిడిన
నేత్రరోగములనుబాపినిర్మలముగ
దృష్టిఁగలిగించుగరుడునిదృష్టిమాడ్కి
నవనిజనములకానందమతిశయింప
నతిదయాసాంద్రవృష్ణికులాబ్ధిచంద్ర.

టీ. అతి = ఎక్కువైన, దయాసాంద్ర = దట్టముయినదయగలవాఁడా! వృష్ణికులాబ్ధి = యాదవకులమను సముద్రమునకు, చంద్ర = చంద్రునివంటిశ్రీకృష్ణమూర్తీ! వినుము = ఆలకింపుము సీస = సీసముయొక్కయు, రాగి = తామ్రముయొక్కయు, ఇనుము = ఇనుముయొక్కయు, విభూతులు = భస్మములు, కటుకరోహిణి, వస, కడలినురుగు సముద్రఫేనము, మైలుతుత్తము, రక్తమణిశిల, మధుకంబు = యష్టిమధుకంబును = పటిక = పటికయు మానిసిపుఱ్ఱె = మనుష్యుని తలపెంకును, పాదరసము, త్రికటుక = శొంఠి పిప్పలి మిరియములును, టంకణ = వెలిగారమును, త్రిఫలంబులును = కరకతాండ్రయుసిరికలును, నాభి, శంఖంబు = శంఖభస్మము, వచ్చని = పచ్చగానుండు, సైంధవమును = సైంధవలవణమును, గవ్వలు = వరాటభస్మమును, ఆరతికర్పూరమును, రసాంజనమును, = ఇంగిలీకమును, చిల్లగింజలును = ఇండుపగింజలును, కూర్చి = చేర్చి, కల్వంబునందుంచి = కల్వమునందువేసి, గానుగచెక్కరసంబుచేన్ = గానుగరసముచేత, నూరి = మర్దించి, కణికలుచేసి, దాచి = భద్రపరచి, ముద్గమాత్రము = పెసరగింజప్రమాణము, తోయమునన్ = ఉదకముతో, తీసి= అరగదీసి, ఈమహాగరుడాంజనము, కన్నుగవలనిడినన్ కనులయందుఁ బెట్టినయెడల, నేత్రరోగములను = కనుజబ్బులను, నిర్మలముగన్ = నిర్మలముగా, బాపి= పోఁగొట్టి, అవనిజనములకానందమతిశయింపన్ = భూప్రజకు సంతోషము వృద్ధియగునట్లు, గరుడునిదృష్టిమాడ్కిన్ = గరుత్మంతునిచూపుతో సమానముగా, దృష్టి గలిగించు = చూపునిచ్చును.

శా. సీసభస్మము, తామ్రభస్మము, ఇనుపభస్మము, కటుకరోహిణి, వస సముద్రఫేనము, మైలుతుత్తము, రక్తమణిశిల, యష్టిమధుకము, పటిక, తలపెంకు, పాదరసము, శొంఠిపిప్పలిమిరియములు, వెలిగారము కరక తాడియుసికలును, నాభి, శంఖభస్మము, సైంధవలవణము, వరాటభస్మము, అరతికర్పూరము, ఇంగిలీకభస్మము, ఇందుపగింజలును, సమానభాగములు చేసి, గానుగచెక్కరసముతోనూరి కణికలు చేసియుంచుకొని పెసరగింజంత ప్రమాణము నీటితో అరుగదీసి కనులకుబట్టించినయెడలకంటిజబ్బులన్నియుఁబోఁగొట్టిగరుత్మంతునిచూపువంటిచూపునిచ్చును,

22 నేత్రాంజనము.

సీ. పొంగసీసమునుక్కు రసములభస్మముల్
నాభిసౌవీరాంజనములుమఱియుఁ
బిప్పళ్ళునారతికప్పురంబునుసమం
బొసఁగిసంధ్యావర్తరసముచేత
నినుపకల్వంబునందినుపగూటమ్మునఁ
గలయఁగబటికింతగలిపితిరుగ
మర్దించియదితగుమాత్రింబునేర్పుతో
నయనంబులందిడనాణెముగను
దురదనెరుపులపువ్వులదుర్భరంపు
వర్తిరోగమ్ములను నేత్రవాతములను
శమనమొనరించునేత్రాంజనముకృపాల
వాలగోపాలతప్తసువర్ణచేల.

టీ. కృప = దయకు - ఆలవాల = పాదువంటివాఁడా! తప్తసువర్ణచేల = వన్నెయెక్కినబంగారు బట్టగలవాఁడా! గోపాల = ఓగోపాలమూర్తి! పొంగన్ = ఒప్పునట్లు- సీసమున్ = సీసముయొక్కయు- ఉక్కు = ఉక్కుయొక్కయు- రసము = పాదరసముయొక్కయు- భస్మముల్ = భస్మములు- నాభి = నాభియు- సౌవీరాంజనము = సౌవీరాంజనమును- మఱియు = ఇంకను- పిప్పళ్ళు- ఆరతికప్పురంబు, సమంబు = సమానభాగములు- ఒసఁగి = ఉంచి- సంధ్యావర్తరసముచేత = ప్రొద్దుతిరుగుడుపువ్వురసముతో - ఇనుపకల్వంబునందు- ఇనుపగూటమ్మునన్ - ఇనుపగూటముతో - కలియగన్ = కలియునట్లు- ఇంతపటిక = కొంతపటికను- కలిపి- తిరుగమర్దించి = నూరలనూరి

అది = ఆయౌషధము, తగుమాత్రింబు = కొంచెము, నేర్పుతో = పదిలముగా, నయనంబులందు = కనులయందు, నాణెముగను = చక్కఁగా, ఇడన్ = పెట్టినట్టయిన, దురదన్ = దురదను, ఎరుపుల = ఎరుపులను, పూవులన్ = పువ్వులను, దుర్భరంపు = భరింపశక్యముగాని- వర్తిరోగమ్ములను = వర్తిరోగములను, (ఏడుపొరలలోపలబుట్టు జబ్బు) నేత్రవాతములను, నేత్రాంజనము = ఈయౌషధము, శమనమొనరించున్ = శాంతింపజేయును.

శా. సీసభస్మము, ఉక్కుభస్మము, రసభస్మము, నాభి, సౌవీరాంజనము పిప్పళ్ళు ఆరతికర్పూరము, సమానభాగములు చేసి ప్రొద్దుతిరుగుడుపూవురసముతో నినుపకల్వమందు ఇనుపగూటముతోనూరి పిదపకొంతపటికనుకలిపి మరలనూరి యౌషధము కొంచెము నేర్పుతో కనులకుఁబట్టించిన దురదలు ఎరుపులు, పువ్వులు, భరింపశక్యముగానివర్తిరోగములును, నేత్రవాతములుపోవును.

23 సైంధవాంజనము.

సీ. పరిశుద్ధమైనట్టిపారదభసితంబు
సైంధవమ్మునురసాంజనముసీస
భస్మంబునుసిరికపప్పునుపిప్పళ్ళు
సమభాగములుగానుసంగ్రహించి
చూర్ణంబుగావించి చొక్కమౌచక్కెర
పానకానందములపాకునీట
నేతనుదేనెను నేర్పుతోడనుకంచు
పళ్ళెరమందుంచిపైనరాచి
ముంతతోడనుమర్దించిముఖ్యముగను
గనులయందిడనేత్రరోగములబాధ
లన్నియునుమానునీసైంధవాంజనమున
నార్తజనరక్షపద్మపత్రాయతాక్ష.

టీ. ఆర్తజనరక్ష = ఆపదలుగలజనులను రక్షించువాఁడా! పద్మపత్ర = తామరరేకులవంటి, ఆయత = విశాలములయిన, అక్ష = నేత్రములుగలవిష్ణుమూర్తి! పరిశుద్ధమైనట్టి = మిక్కిలిశుభ్రమయిన పారదభసితంబు = పాదరసభస్మమును, సైంధవమ్మును = సైంధవలవణమును రసాంజనమున్ = ఇంగిలీకమును సీసభస్మంబునన్

సీసభస్మము, ఉసిరికపప్పును, పిప్పళ్ళు, సమభాగములుగాను = సరియైనపాళ్ళుగా, సంగ్రహించి = చేర్చి, చూర్ణంబుగావించి = పొడిచేసి, చొక్కమౌ = శ్రేష్ఠమైన, చక్కెరపానకానన్ = చక్కెరపానకముచేతను, తమలపాకునీటన్ = తమలపాకు రసముతోను, నేతను = నేతితోను, తేనెను = తేనెతోడను, నేర్పుతోడను = పదిలముగా, కంచుపళ్ళెరమందు = ఉంచి, పైన = తరువాత, రాగిచుంబుతోడను = రాగిచెంబుతో, మర్దించి = నూరి, ముఖ్యముగను = తప్పక, కనులయందిడన్ = నేత్రములయందుంబట్టించఁగా, ఈ సైంధవాంజనమునన్ = ఈచెప్పిన సైంధవాంజనమను పేరుగల కాటుకచే, నేత్రరోగముల = కనుల జబ్బులయొక్క, బాధలన్నియును మానును.

తా. పాదరసభస్మము, సైంధవలవణము, ఇంగిలీకము, సీసభస్మము, ఉసిరికపప్పు, పిప్పళ్లు సమాన భాగములుచేసి చూర్ణముచేసి చక్కెర పానకముతోను, తమలపాకు రసముతోను, నేతితోను, తేనెతోను, కంచుపళ్ళెముమీఁదవేసి రాగిచెంబుతో నూరి కనులకు బట్టించినయెడల నేత్రరోగముల బాధలన్నియును మానును.

24 తారాంజనము.

సీ. రాగికంచుము వెండిరసములభసితముల్
మైలతుత్థమును కఫరిరసాంజ
నమునుమ్రానిపసపు నాభిశంఖమురోహి
ణియుసమాంశలుగానునిగుడఁగూర్చి
పదియామములు హంసపాదిరసమ్ముచే
మర్దించి కణికలమర్చినట్టి
తారాంజనముయుక్తి దనరంగజలములు
మొదలుగా ననుపానములనుదగిన
మాత్రముగఁదీసి నేర్పుతో నేత్రములను
బెట్టిరేనియు మనుజులు బెట్టిదంపు
నేత్రరోగమ్ము లెమ్మెనన్నియును మాను
నార్తజనరక్ష పద్మపత్రాయతాక్ష
దీనసంతానవృక్ష సన్మౌనిరక్ష.

టీ. ఆర్తజనరక్ష = ఆపదలను బొందినజనులను రక్షించువాఁడా!, పద్మపత్రాయతాక్ష = తామరరేకులవంటి విశాలములయిన నేత్రములుగలవాఁడా, దీన = దీన

జనులకు, సంతానవృక్ష = కల్పవృక్షము వంటివాఁడా, సన్మౌనిరక్ష = యోగ్యమయిన మునీశ్వరులను రక్షించు విష్ణుమూర్తీ! రాగి = తామ్రము యొక్కయు, కంచును = కంచు యొక్కయు, వెండి = వెండియొక్కయు, రసము = రసముయొక్కయు, భసితముల్ = భస్మములును, మైలుతుత్తమును, కఫరి = పాలతుత్థమును, రసాంజనమును = ఇంగిలీకమును, మ్రాని పసపు నాభి, శంఖము = శంఖభస్మము, రోహిణి కటుకరోహిణి, సమాంశలుగాను = సమానభాగములుగా, నిగుడన్ = ఒప్పునట్లు, కూర్చి = చేర్చి, పదియామములు = పదిజాములు హంసపాదిరసమ్ముచే = హంసపాదియాకు రసముతోడ, మర్దించి = నూరి, కణికలమర్చినట్టి = కణికలుగాజేసినట్టి, తారాంజనము = ఈకాటుక, యుక్తిదనరంగన్ = సమయమూలోచించి, జలము మొదలుగాన్ = నీరు మొదలయినట్టి, అనుపానములను = అనుపానములతో, తగు మాత్రముగన్ = కనులకుఁ బట్టించుటకుఁ జాలినంత, తీసి = అరగఁదీసి, నేర్పుతో = నేర్పుతో, మనుజులు = మనుష్యులు నేత్రములను బెట్టిరేనియున్ = కనులకు బట్టించినట్టయిన, బెట్టిదంపు = అశక్యమయిన, నేత్రరోగమ్ములు = కంటిజబ్బులు ఎమ్మెన్ = నిశ్శేషముగా, అన్నియునుమానున్ = అన్నియును నివారించును.

తా. తామ్రభస్మము, (రాగి) కాంస్యభస్మము (కంచు) రజితభస్మము (వెండి) పాదరసభస్మము, మైలతుత్థము, పాలతుత్తము, ఇంగిలీకము, మ్రాని పసపు, నాభి, శంఖభస్మము, కటుకరోహిణి సమభాగములుచేసి హంసపాదియాకు రసముతో పదిజాములునూరి కణికలు చేసి సమయమునుబట్టి నీళ్లు మొదలయిన అనుపానములతో నూరి కనులకు బట్టించినయెడల ఎంతకఠినపు నేత్రరోగములయినను వెంటనే నివారించును.

25 భుజగాంజనము.

ఉ. పాలిడిసీసభస్మమొకపాలుమణిశ్శిలపాళ్ళురెండుగాఁ
గ్రాలుమయూరతుత్థమిడికప్పురముంఁదగుకొద్దికల్పియుం
జాలఁగఁదుమ్మిపూవులరసమ్మననూరియుఁగన్నులందిడం
బూలునువర్తిరోగములుఁ బొక్కులునుమ్మాను రమేశకేశవా.

టీ. రమేశ = లక్ష్మీనాయకా, కేశవా = [illegible] విష్ణుమూర్తీ! సీసభస్మము, పాలిడి = ఒకపాలుంచి, ఒకపాలు మణిశ్శిల, పాళ్లురెండుగాన్ = రెండు భాగములుగా -- క్రాలు = ప్రశస్తమగు, మయూరతుత్థము [illegible] తుత్థముంచి, తగు కొ

ద్ధి = తగు మాత్రము, కప్పురముఁ = ఆరతి కర్పూరమును, కల్పియుఁ = కలిపి, చాలఁగన్ = చాలునట్లు, తుమ్మిపూవులరసమ్మునన్ = తుమ్మిపూవులరసముతో, నూరియు = మర్దించి, కన్నులందిడఁ = నేత్రములకుఁబట్టించినయెడల, పూలును = పువ్వులను, వర్తిరోగములు = గ్రుడ్డుపొరలలోనిజబ్బులును, పొక్కులు, మానుఁ = మానిపోవును.

తా. ఒకపాలుసీసభస్మము ఒకపాలుమణిశిల, రెండుపాళ్లు మైలుతుత్థము, తగుమాత్రము ఆరతికర్పూరమునుకలిపి తుమ్మిపూవుల రసముతోనూరి కనులకుబట్టించినయెడల పువ్వులును, పొరలలోనిజబ్బులును పొక్కులును మానిపోవును.

26 తుత్థాంజనము.

సీసమాలిక.

మాయూరతుత్థంబుమట్టియూడలుయష్టి
మధుక శంఖంబులుమ్రానిపసపు
కటుకత్రయంబును గానుగవిత్తులు
గంధకమ్మునుదాళకమ్ము రసము
వాయువిళంగముల్ వసయుసైంధవలవం
గములునునీలాంజనమునుపాల
తుత్థంబునుంజిల్లవిత్తులామలకంబుఁ
బరిశుద్ధతామ్రభస్మలోహ
ములుఁదుల్యమగుభాగములుగాఁగనిడిమాది
ఫలరసమ్ముననూరి బాగుమీఱఁ
గణికలుగావించి గాలుపారఁగఁజేసి
జలములతో నేత్రములను వేయ
నిట్టితుత్థాంజనమ్ముచే నెట్టిదుష్ట
నేత్రకాచంబుపువ్వులునిఖిలరోగ
బాధలనుబోవుశ్రీలోలభక్తపాల
బాలగోపాలగుణశీలధర్మచేల.

టీ. గుణశీల = సద్గుణస్వభావముగలవాఁడా! ధర్మచేల = బంగరు బట్టగలవాఁడా! భక్తపాల = భక్తులనురక్షించువాఁడా! శ్రీలోల = లక్ష్మీదేవియందాసక్తిగలవాఁడా! బాలగోపాల = ఓ బాలకృష్ణమూర్తీ! మాయూరతుత్థంబు = మైలుతుత్థము - మట్టియూడలు - యష్టిమధుక - శంఖంబులు = యష్టిమధుకము - శంఖభస్మము మ్రానిపసపు - కటుకత్రయంబును = శొంఠిపిప్పలిమిరియములును గానుగవిత్తులు - గంధకమ్మును - తాళకమ్ము = తాళకమును - రసము = పాదరసము - వాయువిళంగముల్ వాయువిళంగములును - వసయు సైంధవలవంగములును = సైంధవలవణము - లవంగములును - నీలాంజనమును - పాలతుత్థంబునుఁ = పాలతుత్థమును - చిల్లవిత్తులు = ఇండుపగింజలు - ఆమలకంబుఁ = ఉసిరికపప్పును - పరిశుద్ధమౌ = మిక్కిలిశుభ్రమగు - తామ్రభస్మలోహములుఁ = తామ్రభస్మము. లోహభస్మమును - తుల్యమగు = సమానమగు - భాగములు గాఁగఁ పాళ్ళుగా - ఇడి = ఉంచి - మాదీఫలరసంబునఁ = మాదీఫలరసముతో - బాగుమీఱఁ = చక్కఁగా - నూరి = మర్దించి - కణికలు గావించి = కణికలు చేసి - గాలుపారఁగఁజేసి = నీడనారునట్లుచేసి - జలములతోఁ = నీళ్ళతో సరుగఁదీసి - నేత్రములను వేయఁ = కనులకుబట్టించినయెడల - ఇట్టి = ఈమీఁద చెప్పిన తుత్థాంజనమ్ముచేఁ = తుత్థాంజమను పేరుగలకాటుకచే - ఎట్టిదుష్టనేత్రకాచలుఁ = ఎటువంటికష్టతరమగు నేత్రకాచరోగములైనను - పువ్వులు - నిఖిలరోగబాధలును = మఱియు సమస్తమయిన నేత్రవ్యాధులును, పోవుఁ = మానును.

తా. మైలుతుత్థము, మట్టియూడలు, యష్టిమధుకము, శంఖభస్మము, మ్రానిపసపు, శొంఠిపిప్పలిమిరియములు, గానుగగింజలు, గంధకము, తాళకము, పాదరసభస్మము, వాయివిళంగములు, వస, సైంధవలవణము, లవంగములు, నీలాంజనము, పాలతుత్థము, ఇండుపగింజలు, ఉసిరికపప్పు, మంచితామ్రభస్మము, లోహభస్మము, సమానభాగములు చేసి, మాదీఫలరసముతో నూరి కణికలు చేసి నీడనారించి నీళ్ళతో నూరి, కనులకుబట్టించినయెడల అసాధ్యములగు కాచరోగములు, పువ్వులును మొదలయిన నేత్రవ్యాధులన్నియును మానును.

27. లోహాంజనము.

సీసమాలిక.

జలధిఫేనమురసాంజనమునుబటికకు
ర్వింద౦బుఁదాఁ బేటిపిప్పలింత

సంగూర్చి వానికి సరి రక్తమణిశిల
యిడి మణిశిలకు నిబ్బడి కటుకత్ర
యమిడి యా కటుకత్రయముకి బ్బడిగ సింధు
లవణంబు నా సింధులవణ మెత్తు
లోహంబు గూర్చి యా లోహ మెత్తతివస
గలిపి యన్నియు లెస్స కలియ నేయి
నైనను బువ్వు తేనెనైనను నలుగంగఁ
జేసి కరాటానఁ దీసి దాచి
కన్నులఁ బెట్టినఁ గాచలు లోచన
వాతమ్ములును బత్మ్మఘాతములును
దురద లెరువులు నిరుకులు పొరలు నేత్ర
గండమాలలు పువ్వులుఁ బుందులడఁగు
నిట్టి లోహాంజనమ్ము చేసిందిరేశ
కలుషభయనాశ నిఖిలలోకప్రకాశ.

టీ. కలుషభయనాశ = పాపభయము పోగొట్టువాఁడా ! నిఖిలలోకప్రకాశ = సమస్తలోకములయందుఁ బ్రకాశించువాఁడా ! అనిగాని - లేక - సమస్తలోకములకు వెలుగునిచ్చువాఁడా ! ఇందిరేశ = లక్ష్మీనాథుఁడవగు విష్ణుమూర్తీ ! జలధిఫేనము = సముద్రపునురుగు - రసాంజనమును = ఇంగిలీకమును - పటిక, కురివిందంబున్ = కురువిందమును - తాంబేటివీపు పెంకు - సరిగూర్చి = సమానభాగములు చేసి - వానికి = పయిఁ జెప్పినవానికి - సరి = సమానముగా రక్తమణిశిల - ఇడి = చేర్చి - మణిశిలకు - ఇబ్బడి = రెండురెట్లు - కటుకత్రియము = శొంఠిపిప్పలిమిరియములు - ఇడి = చేర్చి - ఆకటుకత్రయముకు = ఆశొంఠిపిప్పలిమిరియములకు - ఇబ్బడిగన్ = రెట్టింపుగా సింధులవణంబు = సైంధవలవణంబు - ఆసింధులవణమెత్తు = ఆ సైంధవలవణ మెత్తు - లోహంబుఁ గూర్చి = లోహభస్మమును జేర్చి - ఆలోహమెత్తు - అతివసగలిపి, అన్నియున్ = అన్నియును - లెస్సకలియన్ = చక్కఁగాఁ గలియునట్లు - నేయినైనను = నేతితోనైనను - పువు తేనెనైనను = పువ్వు తేనెతోనైనను - నలుగంగఁ జేసి = నలుగునట్లు చేసి - కరాటానన్ = బరిణియందు - దాచి - కన్నులఁ బెట్టినన్ = కనులకుఁ బట్టించిన యెడల - కాచలు - లోచనవాతమ్ములు = నేత్రవాతములును - పత్మ్మఘాతములును = రె

ప్పజబ్బులును - దురదలు - ఎరుపులు, ఇరుకులు - పొరలు - నేత్రగండమాలలు పువ్వులున్ = పువ్వులును - పుందులు = పుండ్లును - ఇట్టిలోహాంజనమ్ము చేత = ఈ చెప్పిన లోహాంజనము కాటుకతో - అడగున్ = అణఁగిపోవును.

తా. సముద్రపునురుగు, ఇంగిలీకము, పటిక, కురువిందము, తాబేటివీపు పెంకు, సమానభాగములు చేర్చి వీనికి సమానముగా రక్తమణిశిల చేర్చి, మణిశిలకు రెట్టింపు శొంఠి పిప్పలి మిరియములు చేర్చి, ఆశొంఠి పిప్పలి మిరియములకు రెట్టింపు సైంధవలవణమును, సైంధవలవణ మెత్తు లోహభస్మమును జేర్చి, ఆలోహభస్మ మెత్తు అతివస కలిపి అన్నియును గలియునట్లు చక్కఁగా నేతితోనైనను, తేనెతోనైనను నూరి బరిణయందుంచి కాచి కనులకు బట్టించిన యెడల కాచలు, నేత్రవాతములు రె ప్పజబ్బులు దురదలు, ఎరుపులు ఇరుకులు, పొరలు, నేత్రగండమాలలు, పువ్వులు, పుండ్లు, మానిపోవును.

28 లఘునారికేళాంజనము.

సీ. పగడముల్ గవ్వలుఁ బచ్చకర్పూరంబు
ముత్తియంబులు జిల్లవిత్తనములు
గరకవిత్తులపల్కు లిరుతుత్తములును నీ
లాంజనమ్ము సమాంశలరసి కూర్చి
టెంకాయనీళ్ళచేఁ బొంకమ్ముగా మూఁడు
దినములు మర్దించి తీసి కణిక
లొనరించి వనితలచను బాలనిమ్మవు
ల్సనఁదీసి కన్నులనొనర వేయ
సకలనేత్రరుజమ్ములు శాంతినొందుఁ
బూలుకాయలుఁ బొక్కులుఁ బొరలుమాను
నమరనీ నారికేళాంజనమున నీశ
భానుజాధీశ దుర్భవభయవినాశ.

టీ. భానుజాధీశ = కాళిందీదేవికి ప్రభువయినవాఁడా ! దుర్భవభయ = దుష్టసంసారభయమును, వినాశ = పోగొట్టువాఁడా, ఈశ = దైవమగు కృష్ణా, పగడముల్ = పగడభస్మము - గవ్వలు = వరాటభస్మము - పచ్చకర్పూరంబు = పచ్చక

ర్పూరము - ముత్తియంబులు = ముత్యభస్మము, ఛిల్లవిత్తనములు = ఇండుపగింజలు కరకవిత్తులపల్కులు = కరకకాయగింజలపలుకులును, ఇసుతుత్తము, పాలతుత్తము మైలుతుత్తమును, నీలాంజనమ్ము = నీలాంజనమును, సమాంశలు = సమానభాగములు, అరసికూర్చి = ఆలోచించిచేర్చి - టెంకాయనీళ్ళచేన్ = కొబ్బరికాయనీళ్ళచేత పాంకమ్ముగాన్ = చక్కఁగా - మూఁడుదినములు - మర్దించితీసి = నూఱితీసి-కణికలుగాఁజేసి, వనితలచనుబాలన్ = స్త్రీల చనుబాలచేతను - నిమ్మపుల్సునన్ = నిమ్మపండ్లరసముతోను, తీసి = అరుగఁదీసి, కన్నులనొవర వేయన్ = నేత్రములకుఁ జక్కఁగాఁబట్టించఁగా, సకలనేత్రరుజమ్ములు = సమస్తమయిన, కంటిజబ్బులును, శాంతినొందున్ = నివారణయగును పూలున్ = పువ్వులును, కాయలు, పొక్కులు, పొరలు, అమరన్ = చక్కఁగా - మానున్ = మానును.

తా. పగడభస్మము, వరాటభస్మము, పచ్చకర్పూరము, ముత్యభస్మము, ఇండుపగింజలు కరకకాయగింజల పలుకులు, పాలతుత్తము, మైలుతుత్తము, నీలాంజనము, ఇవి సమానభాగములు చేసి కొబ్బరికాయనీళ్ళతో మూఁడుదినములునూరి కణికలుచేసి స్త్రీల చనుబాలతోను, నిమ్మపండ్లరసముతోను అరగదీసి కనులకుఁ బట్టించినయెడల నేత్రరోగములన్నియును, పువ్వులు, కాయలు, పొక్కులు, పొరలు మానును.

29 మహానారికేళాంజనము.

సీసమాలిక.

సీ. ప్రామినిపసపుయష్టి మధుకంబుత్రిఫలముల్
వేరు వేరుగఁబావుశేరులుగను
గూరిచివేగొట్టి కుంచెడు టెంకాయ
నీళ్ళలోపల వేసినేర్పుతోడ
నష్టభాగముచిక్కునటుకాచిచీరను
వడపోసి వేఱొక్కకడవనునిచి
సన్నపుమంటనుచక్కఁగాదిగఁగాచి
దించిచల్లార్చియందంచితముగ
నారతికర్పూరమబ్ధిఫేనమురసాం
జనముసైంధవమునుజాజుకాయి
మైలుతుత్థమ్ముమిర్యాలుమాడెత్తున
నల్గనూరియుగల్పనాల్గుమాడ
లెత్తుతేనియఁగల్పనీమహానారికే
ళాంజనంబెంతయునదనెతింగి
కన్నులఁబెట్టినఁగాచలుఁబటలముల్
కాయలుగ్రంధులు కామెరలును
నిరుకులెరువులుఁ దిమిరముల్ పొరలుఁబూలు
మంటలంటులు మైలలు కంటిదూల
మాదలునుమాను శిశుపాల మదవిఫాల
వేణుగోపాల రుక్మిణీ ప్రాణలోల.

టీ. శిశుపాల = శిశుపాలుడను రాక్షసునియొక్క - మద=గర్వమును-విఫాల= తెగగొట్టినవాఁడా! రుక్మిణీప్రాణలోల = రుక్మిణీదేవికియిష్టుడైనవాఁడా! వేణుగోపాల = ఓవేణుగోపాలమూర్తీ! మ్రానిపసపు- యష్టిమధుకంబు-త్రిఫలముల్ = కరకతాడియుసిరికలును- వేరువేరుగన్ = వేరువేరుగా - పావుశేరులుగను = పావుశేరుప్రమాణముగ- కూరిచి = చేర్చి- వేగొట్టి = గట్టిగాదంచి - కుంచెడు టెంకాయ నీళ్ళలోపల వేసి- నేర్పుతోడన్ = ఉపాయముతో- అష్టభాగము= ఎనిమిదవవంతు- చిక్కునటులన్ = ఉండునట్లు - కాచి - చీరనువడపోసి = వస్త్రముతోవడియఁగట్టి వేరొక్కకడవనునిచి = యింకొకకడవయందుఁబోసి - సన్నపుమంటను - చక్కఁగా - దిగగాచి- దించి చల్లార్చి - అందు = ఆకషాయమందు- అంచితముగన్ = ఒప్పునట్లు- ఆరతికర్పూరము అబ్ధిఫేనము = సముద్రపునురుగు- రసాంజనము = ఇంగిలీకము, సైంధవలవణమును = సైంధవలవణమును, జాజుకాయి = జేగురుకాయియును, మైలుతుత్తమ్ము = మైలుతుత్తమును - మిర్యాలు = మిరియములును - మాడెత్తునన్ = మాడమాడవంతున, నల్గనూరియున్ = నలుగునట్లునూరి- నాల్గుమాడలెత్తు- తేనియన్ = తేనెను- కల్పన్=కల్పగానయిన, ఈమహానారికేళాంజనంబు, ఎంతయున్ = మిక్కిలి - అదనెఱింగ = సమయమునాలోచించి, కన్నులఁబెట్టినన్ = కనులకుఁ బట్టించినయెడల - కాచలు = కాచరోగములును, పటలముల్ = కృష్ణ, శుక్ల, పీత, రక్తవర్ణంబులుగల పటలరోగంబులును - కాయలు, గ్రంధులు = రెప్పలపైవేయు ముడులవంటి బొబ్బలును, కామె

రలును, ఇరుకులు, ఎరుపులు, తిమిరములు = చీకట్లును, పొరలు, పువ్వులు = పువ్వులును, మంటలు, అంటులు = అంటుకొనుటలు, మైలలు = కంటి మబ్బులును, కంటి దూల = కంటిదురదయు, మాదలును = మాదరోగములును, మానుక = నివర్తించును.

తా. మాత్రిపసపు, యష్టిమధుకమ్ము, కరకతాడియుసిరికలు, వేరువేరుగా పావుశేరుచొప్పునగూర్చి నలుగఁగొట్టి తుంచెడుటెంకాయ నీళ్ళలోఁబోసి ఎనిమిదవవంతు నీళ్ళుమిగులునట్లుకాచి, గుడ్డనువడియఁగట్టి వేరొకకడవలోఁబోసి పన్నపుమంటనుకాచి దించి చల్లార్చి యందు, ఆరతికర్పూరము, సముద్రపునురుగు ఇంగిలీకము, సైంధవలవణము, జేగురుతోయి, మైలుతుత్తము, మిరియాలు, మాదేత్తుమాడెత్తుచొప్పున నలగనూరి కలిపి నాలుగుమాడలెత్తు తేనెగలిపి, సమయముదెలిసికొని యీయంజనమును గనులకుఁ బెట్టినయెడల, కాచలు, పటలములు, కాయలు, గ్రంధులు కామెరలు, ఇరుకులు, ఎరుపు, తిమిరములు, పొరలు, పువ్వులు, మంటలు, అంటులు, మైలలు, దురదలు, మానును.

30. నిశాంజనము.

చ. వసమిరియాలుమాత్రిపసపు బాగుగఁ బిప్పలి సైంధవంబులిం
పెసఁగఁగ నాల్గుదిన్సులొక యెత్తుగఁ గూర్చి కలగరాకుబ
ల్రసమున నూరి నేతనొనరంగ నిశాంజనమక్షులందిడం
బుసులును జీకటుల్ పటలపుంజము నణఁగును పార్థసారథీ.

టీ. పార్థసారథీ = అర్జునునకు రథసారథ్యముచేసిన కృష్ణా! వస, మిరియాలు - మాత్రిపసపు = మాత్రిపసపు = బాగుగక్ = చక్కఁగా - పిప్పలిసైంధవంబులు = పిప్పలికట్టె సైంధలవణము - ఇంపెసఁగఁగ = తగునట్లు - నాల్గుదిన్సులు = ఈచెప్పిన నాలుగువస్తువులును - ఒకయెత్తుగఁగూర్చి సమభాగములు చేసి - కలగరాకుబల్రసమునక్ = ప్రశస్తమగు గుంటకలగరాకురసముతో - నూరి = మర్దించి - నేతక్ = నేతితోఁ గలిపి - ఒనరంగక్ = ఒప్పునట్లు (అనఁగా దగినట్లు) నిశాంజనము - అక్షులందిడక్ = నేత్రములకుఁబట్టించినచో - పుసులును - చీకటుల్ = చీకట్లును - పటలపుంజము = పటలరోగ సముదాయమును - అడంగుక్ = నివారించును.

తా. వస, మిరియాలు, మాత్రిపసపు, పిప్పలికట్టె, సైంధవలవణము, సమానభాగములు చేసి గుంటకలగరాకురసముతో నూరి నేతితోఁ గలిపి కనులకుఁబట్టించిన యెడల పుసులు, చీకట్లు, పటలరోగములు మానును

31 లఘుమరీచాంజనము.

ఆ. నల్లమేకచేమనల్లనిమిర్యాలుఁ
గలియనూరిగట్టికణిక జేసి
కన్నులందుఁబెట్టఁగా నేత్రరోగముల్
పుసులునసలుమాను భుజగశయన.

టీ. భుజగశయన = సర్పశాయివగు శ్రీవిష్ణుమూర్తీ! నల్లమేకచేమ = నల్లగా నుండు మేకయొక్క చేదుకట్టును, నల్లనిమిర్యాలన్ = నల్లమిరియములును, కలియక్ = కలియునట్లు, నూరి = మర్దించి, గట్టికణిక జేసి, కన్నులందుఁబెట్టగాక్ = కనులకుఁబట్టించినయెడల, నేత్రరోగముల్ = కనులజబ్బులగు, పుసులు, నసలు = దురదలును, మానుక్ = మానును.

తా. నల్లమేక చేదుకట్టు, నల్లమిర్యములు కలియనూరి గట్టికణికలుచేసి కనులకుఁ బట్టించినయెడల పుసులు, దురదలు పోవును.

32 త్రికటుకాంజనము.

క. త్రికటుకమును త్రిఫలంబును
బ్రకటితముగ నల్లమేకపంచితమిడివి
డక జామునూరియాదియు
త్సుకతఁ గన్నులకుఁ బెట్టశుక్లములణఁగుక్.

టీ. త్రికటుకమును = శొంఠిపిప్పలిమిరియములును, త్రిఫలంబును = కరకతాడియుసిరికలును, ప్రకటితముగక్ = ఏర్పాటుగా, నల్లమేకపంచితమిడి = నల్లమేకయొక్క నీరుడినిపోసి, వీడక = విడువక, జామునూరి = ఒకజాము మర్దించి, అది ఆయంజనము, ఉత్సుకతక్ = సంతోషముతో, కన్నులకుఁబెట్టక్ = కనులకుం బట్టించినయెడల, శుక్లములు = శుక్లపిల్లములను కనులలో నెత్తురులేక పాలిపోవుటలు, అణఁగుక్ = నివర్తించును.

తా. శొంఠిపిప్పలిమిరియములు, కరకతాడియుసిరికలు, నల్లమేకపంచితముపోసి, విడువక జామువిసుపునూరి యాయంజనమును గనులకుఁ బెట్టినయెడల కనులలో నెత్తురులేక పాలిపోవుటయు శుక్లరోగములు మానును.

33 సుకుమారాంజనము.

సీ. వినురేకుతాళకమ్మునురక్తమణిశిల
పసపుమిర్యమ్ములుఁబటికశంఖ
గంధసారమ్ములుసైంధవలవణంబు
సమభాగములుగూర్చిజంబుఫలపు
సారంబుతోనూరి సరవిగాఁగణికలు
గావించిగాల్పార్చికన్నుగవల
నారూఢినీసుకుమారాంజనము వేయ
మసకలుమలినముల్పుసులుఁబొరఁ
నసిమిరులునీరుగారెడి నయనములును
మంటలెరుపులుభ్రమలుదుర్మాంసములును
గంటిపువ్వులుమానును గరుడవాహ
ప్రజలకెల్లను నానందభరితముగను.

టీ. గరుడవాహ = గరుత్మంతుడు వాహనముగాఁ గల విష్ణుమూర్తీ! విను = ఆకర్ణింపుము, రేకుతాళకమ్మును = రేకులవలెనుండు హరిదళమును, రక్తమణిశిల = ఎఱ్ఱమణిశిలయు, పసపు, మిర్యమ్ములు = మిరియములును, పటిక, శంఖ గంధసారమ్ములు = శంఖభస్మము. చందనము, సైంధవలవణంబు, సమభాగములుగూర్చి = సమానభాగములుచేసి జంబుఫలపు సారంబుతోన్ = నేరేడుపండ్ల రసముతో, నూరి = మర్దించి, సరవిగాన్ = చక్కఁగా, కణికలుగావించి = కణికలుగాఁజేసి, గాల్పార్చి = నీడనారబెట్టి, ఆరూఢిన్ = నిశ్చయముగా, ఈసుకుమారాంజనము, కన్నుగవలన్ = నేత్రములకు, వేయన్ = పట్టించినమొదల, మసకలు, మలినముల్ = మలినములును, పుసులున్ = పుసులును, పొరలు, ససిమిరులు = దురదలు, నీరుగారెడి నయనములును = నీరుగారు కంటిజబ్బులును, మంటలు ఎరుపులు, భ్రమలు = తిరుగుట, దుర్మాంసములును, కంటిపువ్వులును, ప్రజలకెల్లన్ = జనులకంతికిని, ఆనందభరితముగను = సంతోషము నిండునట్లు, మానున్ = నివర్తించును.

తా. రేకుతాళకము, రక్తమణిశిల, పసపు, మిరియములు, పటిక, శంఖభస్మము, చందనము, సైంధవలవణము, సమానభాగములుచేసి నేరేడుపండ్లరసముతో

[illegible] కణికలుచేసి, నీడనారఁబెట్టి కనులకుఁ బట్టించినమొదల, మసకలు, మలిన ములు, పుసులు, పొరలు, దురదలు, నీరుకారుట, మంటలు, ఎరుపులు, తిరుగుట, దుర్మాంసములు, పువ్వులు మానును.

34 తామ్రాంజనము.

సీ. ఘనతామ్రభస్మంబుఁగరకకాయలజీడి
గింజలమసియునుమంజులముగ
వెన్నతోఁదళియపై వేసియురాగిముం
తనుమర్దనలుచేసిజనులకెల్లఁ
గన్నులఁబుట్టురోగంబులుకామెర
ల్మాదకన్నులుదూలమాదతిమిర
మాదలుమాదదుర్మాంసంబు రేఁజీఁకు
నీళ్ళుగారెడికనుల్ నిలువుకనులు
నేత్రవాతంబులెరుపులు నేత్రశూల
పక్షఘాతశిరోవాతభగ్నవాత
కామిలావాతశూలలుగ్రంధులక్షి
గండమాలలుమఱితూలికలునణఁగు.

టీ. ఘనతామ్రభస్మంబునన్ = మంచితామ్రభస్మమును, కరకకాయలయొక్కయు, జీడిగింజలయొక్కయు, మసియును, మంజులముగన్ = చక్కఁగా, వెన్నతోన్ = వెన్నతోడ, తళియపైన్ పళ్ళెముమీఁద, వేసియు = ఉంచి రాగిముంతను = రాగిచెంబుతో, మర్దనలుచేసి = నూరి, జనులకెల్లన్ = మనుజులకంతటికి, కన్నులఁబుట్టు = కనులయందుఁబుట్టునట్టి, రోగంబులు = జబ్బులగు, కామెరల్ = కామెరలును, మాదకన్నులుః కంటిమాదలును, దూలమాద = దురదమాదయు తిమిరమాదలు = తిమ్మిరిమాదలును, మాదదుర్మాంసంబు = దుర్మాంసపుమాదలును, రేఁజీఁకు = రేఁజీఁకటియును, నీళ్ళుగారెడికనుల్ = కనులనుండి నీళ్లుకారుటయు, నిలువుకనులు = రెప్పమూతపడని రోగములును, నేత్రవాతంబులు = కంటికిగల్గువాత ములును, ఎరుపులు, నేత్రశూల, పక్షఘాత=పక్షఘాతములును, శిరోవాత = శిరోవా తములు, భగ్నవాత = భగ్నవాతములును, కామిలావాతశూలలు, గ్రంథులు =

ప్పలమీఁద వేయు ముడుఁలవంటి కాయలు, గండమాలలు = గండమాలలును, మ[illegible]కను, లూతికలు = నేత్రిలూతికలును, అణంగున్ = మానిపోవును.

తా. తామ్రిభస్మము, కరకకాయలమసి, జీడిగింజలమసి, వెన్నతో పళ్ళెములమీఁద వేసి రాగిముంతతో నూఱి, కనులకుఁ బట్టించినయెడల, పైనజెప్పబడిన రోగములన్నియును మానును.

35 రజితాంజనము.

ఆ. వెండి పందికొమ్ము వెలయ నేనుఁగుఁగోరుఁ
గోడిగొంతుకెముకఁ గూర్చి సరిగఁ
దేనెతోడ నూరి పూనికన్నులఁ బెట్టఁ
బూలుఁ బటలచయముఁ బొలియుఁ గృష్ణ.

టీ. కృష్ణ = ఓకృష్ణమూర్తీ, వెండి=రజితభస్మము, పందికొమ్ము, వెలయన్ = ప్రకాశించునట్లు, ఏనుఁగుగోరున్ = ఏనుఁగగోరును, కోడిగొంతుకెముకన్ = కోడిగొంతులోని యెముకను, సరిగన్ = సమానభాగములుగా, కూర్చి = చేర్చిఁ తేనెతోడన్ తేనెతోడను, నూరి=మర్దించి, పూని= నిండుమనస్సును వహించి, కన్నులఁబెట్టన్ నేత్రములకుఁ బట్టించినయెడల, పూలు = పుష్పములు, పటలచయమున్ = పటలరోగసముదాయమును, పొలియున్ = నశించును.

తా. రజితభస్మము, పందికొమ్ము, ఏనుగుగోరు, కోడిగొంతులోనియెముక, సమానభాగములుచేసి, తేనెతో నూరి కనులకుఁ బెట్టినయెడల, పుష్పములు, పటలరోగములు నశించును.

గద్యము.

ఇది, శ్రీ[illegible]గోపాల చరణ ధ్యానపరాయణ శ్రీవత్సగో
త్రోద్భవ తాడేపల్లి రంగామాత్య పుత్త్ర బాలగో
పాల ప్రసాదలబ్ధ సకలవిద్యాప్రవీణ పాన
కాల రాయప్రణీతంబయిన, నేత్ర
దర్పణంబు సర్వంబును
సంపూర్ణము.

END OF TITLE